# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 24-10-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:72 పేజీలు:6 వెల: రూ.1/-


## నేటి కందం-నేటికి అందం

ఆదర మొప్ప వరంగలు
సోదరులకు మంచి చేసి శోభను గూర్పన్
పేదలకు హాస్పిటలు నిడి
మోదము నందించ ప్రభుత ముందుకు వచ్చెన్ !

(వరంగల్ లో ప్రభుత్వం ఒక మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను నిర్మించి ప్రారంభించే ఏర్పాట్లు చేసింది. దీని వలన వరంగల్, హనుమకొండ, కాజీపేట వంటి అనేక ప్రాంతాల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం పేదలకు ఉచితంగా అందుతుంది.)

-రాధశ్రీ
సెల్:9494481210



## చురక

దిమాగ్ నక్సలైట్లు
దేశానికి అవునా పీడా
కూల్చగలరా కాషాయం
కట్టుకున్న పవర్ గోడా.
పరిపాలన బాగుంటే
ప్రధానికి భయమెందుకు
పదే పదే విమర్శిస్తూ
పోతున్నరు ముందుకు.

-వేల్పుల నారాయణ
9440433475



## యువశక్తితో బలమైన భారత్.. చిన్మయ సమ్మేళనంలో మోదీ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 23: యువశక్తిని సద్వినియోగం చేసుకోవడం ద్వారానే బలమైన భారత్‌ను నిర్మించవచ్చని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. శుక్రవారం ఢిల్లీలోని భారత్ మండపంలో 'చిన్మయ అమృత మహోత్సవ గ్లోబల్ సమ్మేళన్'ను ప్రధాని మోదీ ప్రారంభించారు.

చిన్మయ మిషన్ 75 ఏళ్ల ఉత్సవాల ముగింపు కార్యక్రమం నేటి నుంచి అక్టోబర్ 25 వరకు జరగనుంది.

ఈ కార్యక్రమంలో ప్రసంగించిన మోదీ... 1993లో ఆధ్యాత్మిక గురువు స్వామి చిన్మయానందతో జరిగిన తన చివరి సమావేశాన్ని గుర్తు చేసుకున్నారు. ఆ భేటీలో దేశాభివృద్ధిలో యువత పాత్ర, యువశక్తిని పెంపొందించడంపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు మోదీ వెల్లడించారు. స్వామిజీతో సమావేశం జరిగిన కొన్నేళ్లకే ప్రజలు తనకు గుజరాత్ ముఖ్యమంత్రిగా సేవ చేసే అవకాశం కల్పించారని, అప్పటి నుంచి తన విధానాలన్నింటిలోనూ యువతే కేంద్ర బిందువుగా నిలుస్తోందని మోదీ పేర్కొన్నారు. అలాగే, చికాగోలో జరిగిన 'పార్లమెంట్ ఆఫ్ ది వరల్డ్ రిలీజియన్స్' శతాబ్ది ఉత్సవాలకు హాజరుకావాలంటూ తాను చేసిన ఆహ్వానాన్ని స్వామి చిన్మయానంద అప్పట్లో అంగీకరించిన విషయాన్ని ప్రధాని గుర్తు చేసుకున్నారు.

చిన్మయ మిషన్ కేవలం ఒక సాధారణ సంస్థ కాదని, ఒక సనాతన ఆధ్యాత్మిక తత్వానికి రూపమని మోదీ అభివర్ణించారు. తన నాగరికతా మూలాల నుంచే భారతదేశం గుర్తింపు పొందుతోందని, మన దేశమే మన స్మృతికి జన్మస్థానమని మోదీ స్పష్టం చేశారు. చిన్మయ అమృత మహోత్సవ వేడుకల్లో భాగంగా దేశవ్యాప్తంగా సుమారు 300 రోజుల్లో 40,000 కిలోమీటర్లు ప్రయాణించి, లక్షలాది మందిని కలుసుకున్న యువతీయువకుల బృందాన్ని ప్రధాని ప్రశంసించారు. వేదాంత, భగవద్గీత జ్ఞానాన్ని అందరికీ అందించే లక్ష్యంతో 1951లో స్వామి చిన్మయానంద ఈ మిషన్‌ను

## తుమ్మిడిహెట్టి బ్యారేజీపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబర్ 23: ఇరిగేషన్ ప్రాజెక్టులపై సీఎం రేవంత్ రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. తుమ్మిడిహెట్టి, డిండి, అచ్చంపేట ప్రాజెక్టులపై చర్చించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీపై మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కావాలని ఈ సందర్భంగా అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మహారాష్ట్రలో ముంపు ప్రభావం, నీటి లభ్యతపై నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

డిండి ప్రాజెక్టుకు ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీల నీరు కేటాయించాలని, అచ్చంపేట ఎత్తిపోతలకు 0.1 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేయాలని సీఎం ఆదేశించారు. శ్రీశైలం, నార్లాపూర్ నుంచి ఏదులకు అదనంగా 0.6 టీఎంసీల నీరు తరలించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. పాలమూరు ప్రాజెక్టు నీటికి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. పంప్‌హౌస్‌లు, పంపులు, ఇతర వ్యవస్థల పనులు వెంటనే చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

## జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు.. అధికారులకు ఎస్ఈసీ కీలక ఆదేశాలు

అమరావతి, అక్టోబర్ 23: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అనిల్ చంద్ర పునేఠా మరో కీలక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు నామినేషన్ల గడువు ఈ రోజు (శుక్రవారం) సాయంత్రం 5 గంటలతో ముగియనుందని తెలిపారు. కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు తమను నామినేషన్లు దాఖలు చేయకుండా ఎవరైనా అడ్డుకున్నారా అనే ఫిర్యాదులను వెంటనే పరిశీలించాలని ఆదేశించారు.

ఈ ఫిర్యాదుల విషయంలో అధికారులు వెంటనే ఫిర్యాదుదారులను ఫోన్‌లో సంప్రదించాలని ఏపీ ఎస్ఈసీ అన్నారు. ఇవాళ సాయంత్రం 5 గంటల్లోపు అభ్యర్థులతో నామినేషన్ దాఖలు చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ విధానానికి అనుగుణంగా సమర్పించిన నామినేషన్లను స్వీకరించాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించాలని అన్నారు. నామినేషన్ల కేంద్రానికి వెళ్లేందుకు అవసరమైన ప్రాంతాల్లో అభ్యర్థులకు వ్యక్తిగత భద్రత కల్పించాలని ఆదేశించారు. నామినేషన్లు వేసేందుకు అవసరమైన ప్రశాంత వాతావరణం కూడా కల్పించాలని ఏపీ ఎస్ఈసీ ఆదేశించారు.

## బంగాళాఖాతంలో బలపడుతున్న అల్పపీడనం..ఏపీలోభారీ వర్షాలు!

అమరావతి, అక్టోబర్ 23:ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. తూర్పు మధ్య-ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఏపీలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

వాతావరణ కేంద్రం తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు మధ్య-ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం శనివారం నాటికి వాయుగుండంగా బలపడనుంది. ఆ తర్వాత ఆదివారం నాటికి ఇది తీవ్ర వాయుగుండంగా మారుతుందని, ఈ నెల 26వ తేదీ ఉదయానికి ఇది తుపానుగా రూపాంతరం చెందే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

ఈ తుపాను ఏర్పడిన తర్వాత రానున్న రెండు రోజుల్లో వాయువ్య దిశగా కదిలి.. ఉత్తరాంధ్ర దక్షిణ ఒడిశా తీరాల వైపు పయనించే సూచనలు ఉన్నట్లు వాతావరణ అధికారులు అంచనా వేస్తున్నారు. దీని కదలికలపై నిరంతరం నిఘా ఉంచినట్లు తెలిపారు. ఈ తుపాను ప్రభావం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపై గట్టిగా ఉండే అవకాశం ఉంది. దీని కారణంగా ఏపీ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

తుపాను హెచ్చరికల నేపథ్యంలో సముద్రం అలజడిగా ఉండే అవకాశం ఉన్నందున, మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లవద్దని అధికారులు స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## క్యూర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే లక్ష్యం: మంత్రి పొంగులేటి



హైదరాబాద్, అక్టోబర్ 23: క్యూర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే లక్ష్యమని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మూడు విడతల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను పూర్తి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈరోజు (శుక్రవారం) ఇందిరమ్మ టవర్స్‌పై హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్లతో మంత్రి పొంగులేటి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై మంత్రి పొంగులేటి అధికారులకు దిశానిర్దేశం చేశారు. పేదల ఉపాధికి ఆటంకం లేకుండా నివాస ప్రాంతాలకు సమీపంలోనే ఇళ్లు నిర్మిస్తున్నామని వెల్లడించారు. ఈ టవర్స్ నిర్మాణానికి భూముల గుర్తింపును వేగవంతం చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.

మొదటి విడతలో ఒక్కో నియోజకవర్గానికి సుమారు 500ల ఇళ్లను నిర్మిస్తున్నట్లు మంత్రి పొంగులేటి చెప్పారు. రెండో, మూడో విడతల నిర్మాణాలకు ముందుగానే స్థలాలను గుర్తిస్తున్నామని అన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆధునిక సాఫ్ట్‌వేర్‌తో ఆన్‌లైన్ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. డ్రా ప్రక్రియ ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేశామని అన్నారు. యూట్యూబ్‌లో ఎప్పుడైనా లబ్ధిదారుల ఎంపిక వివరాలు చూసుకునే అవకాశం కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.

## 'గస్తీ నిర్వహణతో నేరాల నియంత్రణకు కృషి చేయాలి'
### కోదాడ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి
### అనంతగిరి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



నల్గొండ, అక్టోబర్ 23: అనంతగిరి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ను కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ లో పలు రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసు వివరాలను స్థానిక ఎస్ఐ ఏడుకొండలును అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. శాంతి భద్రతల విషయంలో ఎక్కడ రాజీ పడకుండా పోలీసులు విధులు నిర్వహించాలని సూచించారు. మండలంలో నిరంతరం గస్తీ నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని పేర్కొన్నారు.

## వేయిస్తంభాల గుడి సుందరీకరణకు ప్రజలు సహకరించాలి : మున్సిపల్ కమిషనర్ వెంకన్న



హన్మకొండ, అక్టోబర్ 23:(నేటినిజం ప్రతినిధి)చారిత్రక రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయ అభివృద్ధికి, సుందరీకరణకు స్థానిక ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ టి.వెంకన్న కోరారు. 'కుడా', మున్సిపల్ శాఖల సమన్వయంతో పనిచేస్తున్నామని, గుడి ముందు భాగంలోని గృహ యజమానులతో సంప్రదింపులు జరిపి వారికి కలెక్టర్ అనుమతితో నష్టపరిహారం చెల్లిస్తామని ఆయన అన్నారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ దేవాలయాన్ని సందర్శించి ఉత్తిష్ఠ గణపతి దర్శనం చేసుకొని రుద్రేశ్వరస్వామికి రుద్రాభిషేకం నిర్వర్తించుకున్నారు.

ఈనెల 10 నుంచి 22 వరకు నగరంలో ఎంగిలిపూల బతుకమ్మ, సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవానికి వేయిస్తంభాల గుడి, పద్మాక్షమ్మగుడి, సిద్దేశ్వరాలయం, కాజీపేట మల్లికార్జునస్వామి దేవాలయం వివిధ ప్రాంతాలలో బతుకమ్మ ఆడుకునే మహిళలకు ప్రత్యేకంగా విద్యుత్ అలంకరణ, పారిశుద్ధ్య పనులు, ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించినందుకుగాను దేవాదాయ, ధర్మాదాయ శాఖ పక్షాన మున్సిపల్ కమిషనర్‌ని, సిబ్బందిని ఘనంగా సత్కరించారు.

దేవాలయ అభివృద్ధికి ముందు భాగంలో పార్కింగ్ స్థలం కోసం నిధులు మంజూరు చేసినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ నగరంలో ఎలాంటి శానిటేషన్ ఇబ్బంది లేకుండా ప్రతిరోజు మున్సిపల్ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ నిత్యం పర్యవేక్షిస్తున్నామని, వేయిస్తంభాల దేవాలయం ఒక చారిత్రిక ప్రదేశమని, దీన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉన్నదన్నారు. ఎందరో దేశ విదేశస్తులు ఈ దేవాలయాన్ని సందర్శిస్తుంటారని, దానికి అనుగుణంగా మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం రెండు శాఖలపై ఉన్నదన్నారు.

దేవాలయ అభివృద్ధికి సీఎం రూ.20 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. కేంద్ర పురావస్తు శాఖ వారు కూడా కొంత అభివృద్ధి పరుస్తున్నారని ఇంకా చేయాల్సి ఉన్నదని మరుగుదొడ్లకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని 'కుడా' శాఖకు లెటర్ పంపించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.అనిల్‌కుమార్ ప్రధానార్చకుడు గంగు ఉపేందర్‌శర్మ, మణికంఠశర్మ అవధాని, ప్రణవ్, దేవాలయ సిబ్బంది మధుకర్, రామకృష్ణ, రజిత, సుజాత సన్మానించారు. మున్సిపల్ అధికారులు డీఎంహెచ్‌వో రాజారెడ్డి, ఎంహెచ్‌వో రాజేష్, ఇతర మున్సిపల్ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.







ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకులు
శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్య గారి పేరుతో స్థాపించిన




డా॥ పట్టాభి కళా పీఠము
(ప్రతిభకు పట్టాభిషేకం)
(రి. 234/2010)
ఫ్లాట్ నెం. ఎ/404, శివ గ్రీన్ వ్యాలీ, గోరంట్ల, గుంటూరు - 522 034.

ఆహ్వానము

డా॥ పట్టాభి జయంతి –
పట్టాభి అవార్డ్స్–2025 ప్రదానోత్సవ సభ
(సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేకం)

తేది : 14-11-2026 (2వ శనివారం)
వేదిక : పెన్షనర్ల భవనం
తాలూకా కాంపౌండ్, బ్రాడీపేట, గుంటూరు.
సమయం : ఉదయం 10 గం॥లకు

సభా కార్యక్రమం
సభాధ్యక్షులు :
డా॥ తూములూరి రాజేంద్రప్రసాద్
అధ్యక్షులు, డా॥ పట్టాభి కళాపీఠము

ముఖ్య అతిథి :
గౌ॥ శ్రీమతి పొడపాటి తేజస్విని గారు
అధ్యక్షురాలు, ఆం.ప్ర. సృజనాత్మక, సాంస్కృతిక సమితి, అమరావతి

విశిష్ట అతిథి :
ఆచార్య వెలుదండ నిత్యానందరావు గారు
ఉపకులపతి, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్

# వైరస్ కారణ పోలియోకు అంతమే లేదా ..!

## (24 అక్టోబర్ "ప్రపంచ పోలియో నిర్మూలన దినం" సందర్భంగా)

ఒక రకమైన వైరస్ కారణంగా ఐదేండ్ల లోపు పిల్లలకు "పోలియో" లేదా "పోలియోమైలిటిస్ అనే వ్యాధి సోకుతుంది. పోలియో సోకిన పిల్లల్లో నాడీ వ్యవస్థ శాశ్వతంగా దెబ్బతిని, కండరాలు బిగుసుకుపోయి కదల్లేని దుస్థితిలో జీవితకాల పక్షవాత సమస్య ఉత్పన్నమై నడవలేని నిస్సహాయ దుస్థితి ఏర్పడుతుంది. ఎలాంటి చికిత్స అందుబాటులో లేని ఈ వ్యాధికి చిన్నతనంలో పోలియో చుక్కల టీకా ఔషధ మందే శరణ్యం అయ్యింది. పోలియో జబ్బు ఒకటి, రెండేళ్ళ పిల్లలకు అధికంగా వస్తుంది. కాలుషిత నీరు త్రాగడం, కాళ్ళు చేతులు కదకపోవడం, మలం మీద వాలిన ఈగలు తిరిగి ఆహారపదార్థాల మీద వాలడం, రోగి దగ్గినపుడు లేదా తుమ్మినపుడు ఇతరులకు వ్యాపించడం, అపరిశుభ్ర ఆహారం తినడం వల్ల పోలియో వైరస్ సంక్రమిస్తుంది. అపరిశుభ్రమైన వాతావరణంలో పెరిగిన పిల్లల్లో రోగనిరోధకశక్తి బలపడే అవకాశాలు తక్కువగా ఉండడంతో పోలియో సోకే సంభావ్యత అధికంగా ఉంటుంది.

### ప్రపంచ పోలియో నిర్మూలన దినం-2026 ఇతివృత్తం:

పోలియో రహిత సమాజ స్థాపనకు తోడ్పడే అవగాహన పెంపొందించడానికి ప్రతి ఏట 24 అక్టోబరు రోజు "ప్రపంచ పోలియో నిర్మూలన దినం" పాటించడం ఆనవాయితీగా మారింది. ప్రపంచ పోలియో నిర్మూలన దినం-2026 ఇతివృత్తంగా "ఒక రోజు, ఒక దృష్టితో మంచి కోసమే పోలియో అంతం (వన్ డే, వన్ ఫోకస్ : ఎండింగ్ పోలియో ఫర్ గుడ్)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతున్నది. ప్రపంచ పోలియో నిర్మూలన దినం సందర్భంగా ప్రభుత్వ ప్రచారాలు, మీడియాలలో ప్రసంగాలు, రోటరీ క్లబ్లులతో పాటు లయన్స్ క్లబ్బుల సభ్యుల అవగాహనా ర్యాలీలు, విద్యాలయాల్లో పోలియో సంబంధ పోటీలు, పోలియో టీకాల ఆవశ్యకత వివరణలు, పోలియోరహిత సమాజ స్థాపనకు ప్రజల్లో చైతన్య కార్యక్రమాలు లాంటివి పెద్ద ఎత్తున చేపడుతున్నారు.

### పోలియో వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలు:

పోలియో సంక్రమించిన 95 శాతం రోగుల్లో వ్యాధి లక్షణాలు కనిపించవు. కొన్ని కేసుల్లో వైరస్ తీవ్రతను బట్టి విరోచనాలు, కడుపు నొప్పి, జ్వరం, గొంతు నొప్పి, తల నొప్పి, కండరాల నొప్పి, నడుం నొప్పి, చర్మంపై దద్దుర్లు, కండరాలు బిగుసుకు పోవడం, నీరసం, పక్షవాతం, శ్వాస ఇబ్బంది లాంటి వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. పోలియో తీవ్రత పెరిగితే కోమాలోకి వెళ్ళడం, చివరకు మరణం కూడా సంభవించవచ్చు. పిల్లలకు మలమూత్రాల విసర్జన పట్ల శిక్షణ ఇవ్వడం, పోలియో టీకాలను వైద్యుల సూచనల మేరకు బాల్యంలోనే ఇప్పించడం, ఈగలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవడం, నీరు కలుషితం కాకుండా చూసుకోవడం, వ్యాధినిరోధకశక్తి పెంచుకోవడం, పరిసరాల పరిశుభ్రత పాటించడం, పోషకాహారం ఇవ్వడం లాంటి నివారణ చర్యలతో పోలియో వ్యాప్తిని కట్టడి చేయవచ్చు.

### పోలియో టీకా ఆవిష్కరణ:

పోలియో వైరస్‌కు విరుగుడుగా జోనాస్ సాల్క్, ఆల్బర్ట్ సబిన్‌లు టీకా రూపొందించారు. ప్రపంచ ఆరోగ్య చరిత్రకు సవాళు విసిరిన మసూచి వ్యాధి నిర్మూలన తరువాత పోలియో అంతానికి తగు ముందు జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతున్నది. నేటికి పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్, నైజీరియా లాంటి దేశాల్లో పోలియో వ్యాధి ఉండటం విచారకరం. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిరంతర కృషితో పోలియో రహిత ప్రపంచం నిర్మించేందుకు పటిష్ట అడుగులు పడుతున్నాయి. 1988లో ప్రపంచవ్యాప్తంగా 3.5 లక్షల పోలియో కేసులు గుర్తించబడినవి.

### పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్:

భారత ప్రభుత్వం 1995లో 'పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్'ను ప్రారంభించింది. పోలియో వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించే కృషిలో భాగంగా ప్రతియోటా 24 అక్టోబర్ రోజున "ప్రపంచ పోలియో నిర్మూలన దినం" పాటించడం ఆనవాయితీగా వస్తున్నది. అధిక జనాభా, నిరక్షరాస్యత, పేదరికం లాంటి సమస్యల నేపథ్యంలో భారత్‌లో పోలియో నిర్మూలన కష్టమని భావించారు. దీనికి తోడుగా 2009లో ప్రపంచ పోలియో కేసుల్లో 60 శాతం వరకు ఇండియాలోనే బయట పడ్డాయి.

ప్రభుత్వ పట్టుదలతో 2011 తరువాత పోలియో కేసులు రిపోర్ట్ కాలేదు. ఈ ప్రయత్నాల ఫలంగా 2014లోనే ప్రభుత్వ చొరవతో పాటు డబ్ల్యూహెచ్ఓ - రోటరీ ఇంటర్నేషనల్ - యూనిసెఫ్‌ల సహకారంతో ఇండియా పోలియోరహిత దేశమని అధికారిక ప్రకటన వెలువడింది. 2020లో విశ్వవ్యాప్తంగా పోలియో టైప్-3 నిర్మూలించబడిందని ప్రకటించడం కూడా జరిగింది.

పోలియో నిర్మూలన యజ్ఞంలో ప్రతి ఒక్క పౌరుడు సైనికుడి వలె జాగ్రత్తలు తీసుకుంటూ, పసి పిల్లలకు సకాలంలో పోలియో టీకాలు ఇప్పించడం మరిచి పోరాదు. పోలియో వ్యాధికి చికిత్స లేదు, టీకాలు వేయిస్తూ నిర్మూలించడమే ఏకైక మార్గమని ప్రజల్లో అవగాహన కల్పిద్దాం. భయంకర పోలియో వైరస్‌ను ప్రపంచం నుంచి తరిమేద్దాం.



-మధుపాలీ
9949700037

# కేంద్ర మంత్రి జె.పి. నడ్డా ముంబైలో 14వ ఇండియా కెమ్ 2026 ప్రారంభం




న్యూ ఢిల్లీ, అక్టోబర్ 23:కేంద్ర రసాయనాలు, ఎరువులు మరియు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల మంత్రి శ్రీ జె.పి. నడ్డా, ఈరోజు ముంబైలో 14వ ఇండియా కెమ్ 2026ను ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో పరిశ్రమల నాయకులు మరియు విధాన రూపకర్తలను ఉద్దేశించి శ్రీ నడ్డా మాట్లాడుతూ, దేశంలో రసాయన రంగానికి ప్రభుత్వం అత్యంత అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తోందని అన్నారు. రసాయన రంగం కోసం ఉద్దేశించిన 'భవ్య రసాయన్' పథకం ఒక విప్లవాత్మక మార్పును తీసుకువస్తుందని ఆయన అన్నారు.

భవ్య రసాయన్ పథకం కింద ప్రపంచవ్యాప్తంగా పోటీపడగల రసాయన తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయడానికి, ఓడరేవులు, రైల్వేలు, విమానాశ్రయాలు, రహదారులతో అనుసంధానం, సమీకృత విలువ గొలుసులు కీలకమైన అంశాలని కేంద్ర మంత్రి వివరించారు.

2047 నాటికి దేశం 'విశిష్ట భారత్' లక్ష్యాన్ని సాధించాలంటే ఈ రంగం అనివార్యమైన పాత్ర పోషిస్తుందని శ్రీ నడ్డా అన్నారు. ఇది దేశీయ పరిశ్రమలకు, అలాగే నేడు పెద్ద సంఖ్యలో ఉన్న బహుళజాతి సంస్థలకు అపారమైన అవకాశాన్ని కల్పిస్తుందని ఆయన అన్నారు. నిస్సందేహంగా, 'విశిష్ట, ఆత్మనిర్భర్ భారత్'కు శక్తివంతమైన, ప్రపంచ స్థాయి రసాయన, పెట్రోకెమికల్ పరిశ్రమ అవసరమని ఆయన అన్నారు.

శ్రీ నడ్డా 'ఇండియా కెమ్ 2026' కోసం ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సందేశాన్ని కూడా చదివి వినిపించారు.

వ్యాపారం చేసే సౌలభ్యాన్ని మెరుగుపరచడం, భారతదేశ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల నెట్‌వర్క్‌ను విస్తరించడం ద్వారా పెట్టుబడులకు, అంతర్జాతీయ మార్కెట్లకు కొత్త మార్గాలు తెరుచుకుంటున్నాయని ప్రధాన మంత్రి తన సందేశంలో పేర్కొన్నారు. ప్రపంచ సరఫరా గొలుసులలో తమ ఉనికిని బలోపేతం చేసుకోవడానికి భారతీయ రసాయన తయారీ దారులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటారని నేను విశ్వసిస్తున్నాను.

ఇండియా కెమ్ 2026 అర్థవంతమైన చర్చలను ప్రోత్సహించి, ఈ రంగం యొక్క దీర్ఘకాలిక అభివృద్ధికి దోహదపడే భాగస్వామ్యాలకు దారితీస్తుందని ప్రధానమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవిస్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ మరియు ఒడిశా ముఖ్యమంత్రి శ్రీ మోహన్ చరణ్ మాంఝీ కూడా ఈ సభను ఉద్దేశించి ప్రసంగించారు. తమ రాష్ట్రాల్లోని రసాయన మరియు పెట్రోకెమికల్ రంగాలలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వారు పరిశ్రమ మరియు వ్యాపార నాయకులను కోరారు.

రసాయన పరిశ్రమ మహారాష్ట్రకు చాలా ముఖ్యమైనదని, ఇది సుమారు మూడు లక్షల మందికి ఉపాధి కల్పిస్తోందని శ్రీ ఫడ్నవిస్ అన్నారు. మహారాష్ట్ర దూరదృష్టితో కూడిన, వ్యాపారం సులభతరం చేసే అంశాలపై ఆధారపడిన పెట్టుబడి స్నేహపూర్వక విధానాన్ని సిద్ధం చేస్తోందని ఆయన తెలిపారు.

మధ్యప్రదేశ్ మరియు ఒడిశా ముఖ్యమంత్రులు, తమ వ్యాపార స్నేహపూర్వక పెట్టుబడి విధానాలు మరియు రసాయన పరిశ్రమ కోసం అందించిన మౌలిక సదుపాయాల నుండి ప్రయోజనం పొందాలని పరిశ్రమలను ఆహ్వానించారు.

ఈ సందర్భంగా, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి శ్రీమతి అనుప్రియ పటేల్ మాట్లాడుతూ, ప్రాథమిక అవసరాలను తీర్చడంలో మరియు జీవన నాణ్యతను మెరుగుపరచడంలో రసాయన మరియు పెట్రోకెమికల్ పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.

ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీమతి అనుప్రియ పటేల్ పారిశ్రామిక నాయకులను కోరారు. మూడు కొత్త ప్రత్యేక కెమికల్ పార్కుల కోసం ప్రభుత్వం భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన (భవ్య) రసాయన్ పథకాన్ని ప్రారంభించిందని మంత్రి తెలిపారు. ఈ పథకాన్ని సాకారం చేయడంలో, అమలు చేయడంలో రాష్ట్రాలు చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి కాబట్టి, పారిశ్రామిక అధినేతలు, రాష్ట్ర ప్రభుత్వాలు ఇందులో సన్నిహితంగా పాలుపంచుకోవాలని ఆమె కోరారు.

రసాయనాలు ఒ పెట్రోకెమికల్స్ శాఖ కార్యదర్శి శ్రీ తేజ్‌వీర్ సింగ్, ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఈ కార్యక్రమ పరిధిని వివరించారు.

వివిధ ఉపరంగాలలో భవిష్యత్ కార్యాచరణపై కేంద్రీకృత సమూహ చర్చల ద్వారా చర్చించడానికి, భారతదేశ రసాయన మరియు పెట్రోకెమికల్ రంగ అభివృద్ధికి ఈ కార్యక్రమం ఒక వేదికను అందిస్తుందని ఆయన అన్నారు.

రాబోయే రెండు రోజుల పాటు జరిగే ఈ చర్చలు, సంభాషణలు వ్యాపార-వ్యాపార పరస్పర చర్యలకు ఒక నిర్మాణాత్మక వేదికను అందిస్తాయని శ్రీ సింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఇండియా కెమ్ 2026 ప్రారంభోత్సవ సమావేశంలో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ మరియు ఎర్నెస్ట్ ఒ యంగ్ (ఇజ) సంయుక్తంగా రూపొందించిన ఒక విజ్ఞాన పత్రాన్ని విడుదల చేశారు.

కేంద్ర మంత్రి శ్రీ నడ్డా, నెస్కో (ఔఇూఅూ) లోని బాంబే ఎగ్జిబిషన్ సెంటర్‌లో 'ఇండియా కెమ్ 2026' అనే అంతర్జాతీయ ప్రదర్శనను కూడా ప్రారంభించారు.

ఈ ప్రదర్శనలో రసాయనాలు, పెట్రోకెమికల్స్, ప్రాసెస్ ప్లాంట్ యంత్రాలు మరియు పరికరాలకు సంబంధించిన విస్తృత శ్రేణి ఉత్పత్తులు, సాంకేతికతలు, పరికరాలు మరియు సేవలు ప్రదర్శించబడతాయి.

శ్రీ నడ్డా ప్రముఖులతో కలిసి 'ఇండియా కెమ్ 2026' ప్రదర్శనలోని స్టాళ్లను సందర్శించి, పరిశ్రమ నాయకులతో ముచ్చటించారు.

రసాయనాలు మరియు ఎరువుల మంత్రిత్వ శాఖ పరిధిలోని రసాయనాలు మరియు పెట్రోకెమికల్స్ విభాగం , ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ( భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న ఈ మూడు రోజుల కార్యక్రమంలో ఒక అంతర్జాతీయ ప్రదర్శన మరియు సదస్సు ఉంటాయి. ఇది పరిశ్రమ నాయకులు, విధాన రూపకర్తలు, పెట్టుబడిదారులు, పరిశోధకులు మరియు అంతర్జాతీయ భాగస్వాములతో సహా రసాయనాలు మరియు పెట్రోకెమికల్స్ రంగంలోని కీలక భాగస్వాములను ఒకచోట చేర్చుతుంది.

"అడ్వాంటేజ్ భారత్: అభివృద్ధి చెందుతున్న గ్లోబల్ కెమికల్స్ హబ్'' అనే ఇతివృత్తంతో నిర్వహించబడుతున్న ఇండియా కెమ్ 2026, దేశీయ మరియు అంతర్జాతీయ భాగస్వాములకు జ్ఞానాన్ని పంచుకోవడానికి, వ్యూహాత్మక పొత్తులను ఏర్పరచుకోవడానికి, పెట్టుబడి అవకాశాలను అన్వేషించడానికి మరియు పరస్పర ప్రయోజనకరమైన వ్యాపార అవకాశాలను గుర్తించడానికి ఒక ఉమ్మడి వేదికను అందిస్తుంది.

భారతదేశంతో ఆర్థిక సహకారాన్ని బలోపేతం చేసే క్రమంలో, రసాయనాలు మరియు పెట్రోకెమికల్స్ రంగంలో సహకారానికి కొత్త మార్గాలను తెరుస్తూ, జపాన్ 'ఇండియా కెమ్ 2026'కు భాగస్వామ్య దేశంగా చేరింది.

మహారాష్ట్ర, గుజరాత్, ఒడిశా, మధ్యప్రదేశ్, బీహార్, ఆంధ్రప్రదేశ్ మరియు ఉత్తరప్రదేశ్ భాగస్వామ్య రాష్ట్రాలుగా ఉన్నాయి. ఈ రంగం యొక్క వృద్ధి, పెట్టుబడులు మరియు పారిశ్రామిక అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడంలో భారత రాష్ట్రాల పెరుగుతున్న పాత్రను ఇది స్పష్టం చేస్తోంది.

14వ ఎడిషన్ యొక్క ఒక ముఖ్యమైన కొత్త అంశం 'ఇండియా కెమ్ యూత్ ఇన్నోవేషన్ ఛాలెంజ్'. రసాయనాలు మరియు పెట్రోకెమికల్స్ రంగం యొక్క మారుతున్న అవసరాలకు అనుగుణంగా యువ ఆవిష్కర్తలు, విద్యార్థులు మరియు వర్ధమాన పారిశ్రామికవేత్తలను భాగస్వామ్యం చేయడమే ఈ కార్యక్రమం యొక్క లక్ష్యం. పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లకు వినూత్నమైన, పరిశోధన ఆధారిత మరియు ఆచరణాత్మక పరిష్కారాలను ప్రోత్సహించాలని ఈ కార్యక్రమం లక్ష్యంగా పెట్టుకుంది.

# అంబులెన్స్- లారీ ఢీ

## ఇద్దరు మృతి.. మరో ముగ్గురికి తీవ్రగాయాలు



ఆదిలాబాద్, అక్టోబర్ 23: వైద్యచికిత్స నిమిత్తంఆదిలాబాద్ నుండి వెళ్తున్న అంబులెన్స్ లారీ ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. సోన్ మండలం కడ్తాల్ వై జంక్షన్ వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది.

సోన్ పోలీసుల వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం ఝరి గ్రామానికి చెందిన పేషెంట్లను హైదరాబాద్‌కు తీసుకెళ్తున్నారు. కడ్తాల్ వై జంక్షన్ వద్దకు రాగానే అతివేగంగా వస్తున్న లారీ అంబులెన్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నుజ్జునుజ్జయిన అంబులెన్స్‌లో ఉన్న బాలిక(12), మరో మహిళ (45) అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరందరినీ జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించారు.

# జాఫర్‌నగర్ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

## అసిస్టెంట్ కమిషనర్‌కు ఎంఐఎం నాయకుల వినతిపత్రం



ఆదిలాబాద్, అక్టోబర్ 23:మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 52వ డివిజన్ జాఫర్‌నగర్‌లో డ్రైనేజీ అవుట్‌లెట్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ ఎంఐఎం నాయకులు శుక్రవారం అసిస్టెంట్ కమిషనర్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఎంఐఎం మంచిర్యాల అధ్యక్షుడు మహమ్మద్ షకీర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అఫాన్ ఆధ్వర్యంలో ఈ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సమస్య కారణంగా సుమారు 150 కుటుంబాలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

డ్రైనేజీ అవుట్‌లెట్ సమస్యను పరిష్కరించకుండానే సంబంధిత భూమిలో మట్టి పోసి ప్లాట్లుగా మార్చే పనులు చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. ముందుగా మురుగునీటి పారుదల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకుండా ప్లాట్లను విక్రయిస్తే, వాటిని కొనుగోలు చేసే ప్రజలు భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. డ్రైనేజీ సమస్య పరిష్కారం కాకముందే ప్లాట్ల విక్రయాలు చేపట్టడం సరికాదని అభిప్రాయపడ్డారు. అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, డ్రైనేజీ మార్గాన్ని పరిరక్షించాలని ఎంఐఎం నాయకులు డిమాండ్ చేశారు. సుమారు 150 కుటుంబాలకు, భవిష్యత్తులో ప్లాట్లు కొనుగోలు చేసే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణ ప్రజల సమస్యను నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.

# తల్లి, కూతురు మృతి

ఆదిలాబాద్, అక్టోబర్ 23:అంబులెన్స్ ను లారీ ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందిన విషాద ఘటన తెలంగాణ రాష్ట్రంలోని నిర్మల్ జిల్లాలో చోటుచేసుకుంది. నిర్మల్ జిల్లా సోన్ మండలం పరిధిలో ఇవాళ ఉదయం తీవ్ర విషాద ఘటన జరిగింది.

మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్తున్న రోగితో ప్రయాణిస్తున్న అంబులెన్స్‌ను ఒక లారీ దారుణంగా ఢీకొట్టింది. ఈ భయానక రోడ్డు ప్రమాదంలో చికిత్స కోసం వెళ్తున్న యువతితో పాటు ఆమెను కాపాడుకునేందుకు వెంట వచ్చిన తల్లి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు.

సోన్-కడ్తాల్ వై (జ) జంక్షన్ వద్ద ఈ ఘటన జరిగింది. ఆదిలాబాద్ జిల్లా గాడిగూడ మండలం జరి గ్రామానికి చెందిన సరస్వతి (22) అనే యువతి కొంతకాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు ఆమెను ఆదిలాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా, అక్కడి వైద్యులు ప్రాథమిక పరీక్షల అనంతరం మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆసుపత్రికి రిఫర్ చేయడంతో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.



# షెడ్యూల్డ్ తెగల యువతకు జీవనోపాధి అవకాశాలను బలోపేతం చేయడానికి త్రైపాక్షిక అవగాహన ఒప్పందం



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 23:గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, నేషనల్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా, ఒడిశాలోని రూర్కెలాలో ఉన్న జీవనోపాధి వ్యాపార ఇంక్యుబేషన్ కేంద్రం ద్వారా షెడ్యూల్డ్ తెగల యువత కోసం జీవనోపాధి ప్రోత్సాహం మరియు వ్యవస్థాపక అభివృద్ధికి మద్దతు ఇస్తోంది. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, మధ్య తరహా మరియు చిన్న తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ , మరియు ఉక్కు మంత్రిత్వ శాఖ పరిధిలోని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ – రూర్కెలా స్టీల్ ప్లాంట్ మధ్య 22.10.2026న ఒక త్రైపాక్షిక అవగాహన ఒప్పందం కుదిరింది.

**నైపుణ్యాభివృద్ధి మరియు సుస్థిర జీవనోపాధులపై దృష్టి:**

అవసరమైన నైపుణ్యాలను అందించడం ద్వారా వారి నైపుణ్యాలను మరియు ప్రక్రియలను ఉన్నతీకరించడంపై ప్రత్యేక దృష్టి పెట్టినప్పుడే ఒక సమాజం యొక్క ఆర్థిక సాధికారతను మరింత ప్రభావవంతంగా చేయవచ్చు. షెడ్యూల్డ్ తెగల వారిలో సుస్థిర జీవనోపాధి వ్యవస్థల ఏర్పాటును సులభతరం చేయడానికి, నైపుణ్యాలు మరియు జ్ఞానాన్ని పెంపొందించడాన్ని నిధుల సమీకరణ వ్యవస్థతో సంక్లిష్టంగా అనుసంధానించాలి. వర్ధమాన పారిశ్రామికవేత్తలకు నిర్దిష్ట ఉద్యోగ పాత్రలలో సామర్థ్య నిర్మాణం మరియు మార్కెటింగ్, బ్రాండింగ్ యొక్క ఆర్థిక అంశాలపై ప్రాథమిక జ్ఞానాన్ని అందించడం అత్యంత ఆవశ్యకం.

**రూర్కెలాలో జీవనోపాధి వ్యాపార ఇంక్యుబేషన్ కేంద్రం:**

ఒడిశాలోని రూర్కెలాలో 2018లో స్థాపించబడిన జీవనోపాధి ఇంక్యుబేషన్ కేంద్రాన్ని గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా గుర్తించడం అటువంటి ఒక ప్రధాన ముందడుగు. ఇది భారత ప్రభుత్వంలోని మూడు మంత్రిత్వ శాఖలు మరియు వాటి పరిధిలోని మూడు కేంద్ర స్థాయి అపెక్స్ ప్రభుత్వ రంగ సంస్థలైన, మధ్య తరహా మరియు చిన్న తరహా పరిశ్రమల ఆధ్వర్యంలోని నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ , ఉక్కు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ – రూర్కెలా స్టీల్ ప్లాంట్ మరియు గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ల యొక్క ఒక విశిష్టమైన సహకార ప్రయత్నం.

**శిక్షణ మరియు వ్యవస్థాపకత అభివృద్ధి:**

స్థానిక ఎస్టీ యువతలో స్థిరమైన సంస్థలను ప్రోత్సహించడానికి, వారికి శిక్షణ, నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపకత అభివృద్ధి కార్యక్రమాలను అందించడమే ఈ కేంద్రం యొక్క ప్రాథమిక లక్ష్యం. శిక్షణ మరియు చేయూతల సమన్వయంతో, సరైన జీవనోపాధి కల్పన ద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంచడం, ఉత్పాదకతను మెరుగుపరచడం మరియు సరైన దిశానిర్దేశం చేయడం దీని ముఖ్య ఉద్దేశం.

ప్రస్తుత సంవత్సరంలో ఎస్టీ వర్గానికి చెందిన విద్యార్థుల కోసం అందించిన కోర్సులు: అసిస్టెంట్ బ్యూటీషియన్, స్వయం ఉపాధి టైలర్, అసిస్టెంట్ కంప్యూటర్ ఆపరేటర్ (టాలీ & అకౌంటింగ్), అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, బ్రెడ్ ఒ బేకరీ తయారీ, పుట్టగొడుగుల సాగు. ఇందుకుగాను, రూర్కెలా స్టీల్ ప్లాంట్ స్థలాన్ని అందించగా, ఎంఎస్ఎంఈ యొక్క పథకం కింద ప్లాంట్ మరియు యంత్రాలను ఏర్పాటు చేశారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుండి వచ్చే గ్రాంట్ ద్వారా ఈ కేంద్రం యొక్క పునరావృత ఖర్చులను ఎన్‌ఎస్టిఎఫ్డిసి భరిస్తోంది. ఈ కేంద్రం వెల్డింగ్ టెక్నాలజీ, ఫర్నిచర్ తయారీ, సోయా పాల వెలికితీత, టోఫు ప్యాకేజింగ్, బ్యూటీషియన్, తయారీ వ్యాపారం (బ్రెడ్ & బేకరీ) వంటి వివిధ కోర్సులలో శిక్షణను అందించింది. ఈ కేంద్రం కాబోయే శిక్షణార్థులలో అవగాహన కల్పిస్తోంది. 600 మందికి పైగా విద్యార్థులు ఈ కేంద్రం ద్వారా ప్రయోజనం పొంది, బేకరీ, పుట్టగొడుగుల పెంపకం, బ్యూటీ పార్లర్, టైలరింగ్ వంటి వివిధ వ్యాపారాలలో తమ సొంత వ్యాపార కార్యకలాపాలను ఏర్పాటు చేసుకున్నారు.

**ఈ కార్యక్రమానికి హాజరైన అధికారులు:**

గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి మరియు ఎన్ఎస్‌టిఎఫ్‌డిసి సిఎండి అయిన శ్రీ టి. రౌమువాన్ పైతే, కంపెనీ కార్యదర్శి శ్రీ కుంజ్ బిహారీ, ఏజిఎం (ప్రాజెక్ట్స్ & సిఎస్ఆర్) శ్రీమతి బిస్మిత దాస్ మరియు తూర్పు జోన్ చీఫ్ జోనల్ మేనేజర్ శ్రీ సునీల్ సాహూలతో కలిసి ఈ కార్యక్రమానికి విచ్చేశారు. సెయిల్ తరపున శ్రీ తపన్ కుమార్ జి. కనేకర్, సిజిఎం (టిఎస్ & సిఎస్ఆర్) మరియు శ్రీ ఆర్.ఎస్. బోరా డిజిఎం (సిఎస్ఆర్) మరియు శ్రీ... ఈ కార్యక్రమంలో ఔుఎఆ తరపున ఓ.పి. సింగ్, సీనియర్ జనరల్ మేనేజర్ (టెక్. ట్రైనింగ్ & డెవలప్‌మెంట్ వర్టికల్ ఒ ూఃజ హెడ్) మరియు చీఫ్ మేనేజర్ శ్రీ మార్కండేయ కుమార్ పాల్గొన్నారు.

# ప్రత్యేక ప్రచారం 6 – గణాంకాలు ఒ కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖకు సంబంధించి ఒక రోజు కార్యక్రమం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 23: ప్రత్యేక ప్రచారం 6.0 కింద ఓనీూఖఎ ఒక రోజు పరిశుభ్రతా కార్యక్రమాన్ని నిర్వహించింది

గణాంకాలు మరియు కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ , మరియు దాని అనుబంధ, అధీన కార్యాలయాలు, ప్రత్యేక ప్రచారం 6లో భాగంగా 7 అక్టోబర్, 2026న ఒక ప్రత్యేక పరిశుభ్రతా కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమం కార్యాలయాల పరిశుభ్రతను మెరుగుపరచడం, పర్యావరణ సుస్థిరతను ప్రోత్సహించడం, బాధ్యతాయుతమైన వ్యర్థాల నిర్వహణను నిర్ధారించడం మరియు కార్యాలయ స్థలాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవడాన్ని సులభతరం చేయడంపై దృష్టి సారించింది.

టాల్‌స్టాయ్ లేన్, కె.ఎల్. భవన్ ప్రాంగణం మరియు జన్‌పథ్ రోడ్‌తో సహా కె.ఎల్. భవన్ చుట్టూ గుర్తించిన మూడు ప్రదేశాలలో సమగ్ర పరిశుభ్రతా కార్యక్రమాలను నిర్వహించింది.

# ఘనంగా వన మహోత్సవం

ఖమ్మం, అక్టోబర్ 23: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో వన మహోత్సవ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీ కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. వన మహోత్సవం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించడం, పర్యావరణ సమతుల్యతను కాపాడటం, కాలుష్యాన్ని తగ్గించడం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# కొత్తగూడెంలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్



కరీంనగర్, అక్టోబర్ 23: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని సఫాయి బస్తి ప్రాంతంలో పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు, కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ పర్యవేక్షణలో ఉదయం 4 గంటల నుంచి 7 గంటల వరకు ఈ తనిఖీలు చేపట్టారు. కొత్తగూడెం 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో సరైన ధ్రువపత్రాలు లేని 47 ద్విచక్ర వాహనాలు, రెండు త్రిచక్ర వాహనాలను పోలీసులు గుర్తించారు. మొత్తం 49 వాహనాలపై చట్టప్రకారం జరిమానాలు విధించారు. అదేవిధంగా తనిఖీల్లో 87 ఐఎంఎఫ్ఎల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల ద్వారా అనుమానాస్పద కార్యకలాపాలు, నిబంధనల ఉల్లంఘనలను గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.

# జమ్మూ కాశ్మీర్ యొక్క క్షేత్రస్థాయి సంక్షేమ కార్యక్రమాలను, మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా అనుసరిస్తున్న సమగ్ర ప్రభుత్వ విధానానికి శ్రీ సుధాన్ష్ పంత్ ప్రశంస

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 23:సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ కేంద్ర కార్యదర్శి సుధాన్ష్ పంత్, సామాజిక సంక్షేమ పథకాల కింద జమ్మూ కాశ్మీర్ చేపట్టిన విస్తృత క్షేత్రస్థాయి కార్యక్రమాలను, మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని ఎదుర్కోవడానికి అనుసరిస్తున్న సమన్వయ, సమగ్ర ప్రభుత్వ విధానాన్ని ఈరోజు ప్రశంసించారు. ఈ కేంద్రపాలిత ప్రాంతం చేస్తున్న ప్రయత్నాలను దేశవ్యాప్తంగా అనుకరించదగిన ఒక ప్రశంసనీయ నమూనాగా ఆయన అభివర్ణించారు.

జమ్మూ కాశ్మీర్‌లో వివిధ సామాజిక సంక్షేమ పథకాలు మరియు కార్యక్రమాల అమలుపై ఆయన, ముఖ్య కార్యదర్శి అటల్ దుల్లూ సంయుక్తంగా అధ్యక్షత వహించిన సమగ్ర సమీక్ష సందర్భంగా శ్రీ పంత్ ఈ వ్యాఖ్యలు చేశారు.

ఈ సమావేశానికి హోం శాఖ అదనపు ముఖ్య కార్యదర్శి; విద్యాశాఖ కమిషనర్ కార్యదర్శి; సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి; ఆరోగ్య శాఖ కార్యదర్శి; కాశ్మీర్ సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ జనరల్; జమ్మూ సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్; శ్రీనగర్ ప్రభుత్వ వైద్య కళాశాల, సైకియాట్రీ విభాగాధిపతి; ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ బోర్డుల కార్యదర్శి, వీరే కాకుండా ఇతర సంబంధిత శాఖల అధికారులు.

క్షేత్రస్థాయి వరకు సంక్షేమ కార్యక్రమాలను విస్తరించడంలో కేంద్రపాలిత ప్రాంత పరిపాలన యంత్రాంగం చేస్తున్న ప్రయత్నాలను ప్రశంసిస్తూ, గ్రామాలు మరియు పంచాయతీల వ్యాప్తంగా చేపట్టిన ఈ కార్యక్రమాలు సమ్మిళిత సంక్షేమ పంపిణీ పట్ల బలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తున్నాయని కేంద్ర కార్యదర్శి పేర్కొన్నారు. మాదకద్రవ్యాల బెడదకు వ్యతిరేకంగా జమ్మూ కాశ్మీర్ చేపట్టిన సమన్విత ప్రచారాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. దీనిలోని 'హోల్-ఆఫ్-గవర్నమెంట్' విధానం దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుందని, ఇది ఇతర ప్రాంతాలకు విజయవంతమైన ఆదర్శంగా నిలవగలదని ఆయన అన్నారు.

వ్యక్తిగత లబ్ధిదారుల-ఆధారిత పథకాల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, విద్యార్థులు, వయోవృద్ధులు, నిరుపేద మహిళలు మరియు ఇతర బలహీన వర్గాల కోసం చేపట్టే కార్యక్రమాలు అర్థవంతమైన ఫలితాలను అందించేలా చూడటం యొక్క ప్రాముఖ్యతను కేంద్ర కార్యదర్శి నొక్కి చెప్పారు. విస్తృత అవగాహన కల్పించడానికి మరియు దేశవ్యాప్తంగా వాటి ప్రభావాన్ని పెంచడానికి, లబ్ధిదారుల ప్రత్యక్ష సాక్ష్యాలను నమోదు చేయాలని, అలాగే ఈ కార్యక్రమాల నుండి వెలువడుతున్న వేలాది విజయగాథలను ప్రదర్శించాలని ఆయన పరిపాలనా యంత్రాంగానికి సూచించారు.

భిక్షాటనలో నిమగ్నమైన వ్యక్తుల పునరావాసాన్ని సమీక్షిస్తూ, కేంద్రపాలిత ప్రాంత పట్టణ కేంద్రాలకు 'భిక్షాటన రహిత నగరం' హోదాను సాధించే దిశగా కృషి చేయాలని శ్రీ పంత్ పరిపాలనా యంత్రాంగాన్ని ప్రోత్సహించారు. సాపేక్షంగా తక్కువ సంఖ్యలో ఉన్న ఇటువంటి వ్యక్తుల సమస్యను కేంద్రీకృత పునరావాసం, నిరంతర మద్దతు మరియు అంకితభావం గల ప్రభుత్వేతర సంస్థల సహకారంతో పరిష్కరించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

మంత్రిత్వ శాఖ లక్ష్యాల సాధనకు వీలుగా కేంద్రపాలిత ప్రాంతం కోసం కీలక ప్రాధాన్యతలు మరియు దృష్టి సారించాల్సిన రంగాలను కూడా కేంద్ర కార్యదర్శి వివరించారు. జమ్మూ కాశ్మీర్ సామాజిక సంక్షేమ శాఖకు ముఖ్య కార్యదర్శి అటల్ దుల్లూ అందిస్తున్న నిరంతర మార్గదర్శకత్వం మరియు సలహాలను ఆయన అభినందించారు. ఈ శాఖ యొక్క విభిన్న బాధ్యతలను సమర్థవంతంగా అమలు చేయడానికి అనేక విభాగాల మధ్య సన్నిహిత సమన్వయం అవసరమని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి అటల్ దుల్లూ మాటాడుతూ, సమ్మిళిత వృద్ధి, సామాజిక న్యాయం మరియు సమాజ సాధికారత పట్ల ప్రభుత్వానికి ఉన్న అచంచలమైన నిబద్ధతను పునరుద్ఘాటించారు. సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన లబ్ధిదారులందరికీ, ముఖ్యంగా సమాజంలోని నిరుపేద మరియు అణగారిన వర్గాలకు చెందిన వారికి పూర్తిగా చేరవేయడానికి కేంద్రపాలిత ప్రాంత పరిపాలన యంత్రాంగం కట్టుబడి ఉందని ఆయన నొక్కి చెప్పారు.

అంతేకాకుండా, జమ్మూ కాశ్మీర్‌లోని వివిధ లబ్ధిదారుల సమూహాల జనాభా వివరాలు, వారి అభ్యున్నతికి అందుబాటులో ఉన్న సంక్షేమ చర్యలు, వారి హక్కులను పరిరక్షించడానికి మరియు అఘాయిత్యాలు, వివక్ష, వేధింపులను నివారించడానికి ఏర్పాటు చేసిన చట్టపరమైన, సంస్థాగత మరియు నియంత్రణపరమైన రక్షణల గురించి ముఖ్య కార్యదర్శి వివరించారు. ఈ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా చూడటానికి సమన్వయ ప్రయత్నాల ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు.

ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి, దోయిఫోడే సాగర్ దత్తాత్రేయ, మాదకద్రవ్యాల డిమాండ్ తగ్గింపు, విద్యా స్కాలర్‌షిప్‌లు, వయోవృద్ధుల సంక్షేమం, పునరావాసం, పారిశుధ్య కార్మికుల భద్రత, సామాజిక అభివృద్ధి మరియు బలహీన వర్గాలకు చట్టపరమైన రక్షణ వంటి వివిధ కేంద్ర ప్రాయోజిత మరియు కేంద్రపాలిత ప్రాంత స్థాయి పథకాల కింద సాధించిన పురోగతిపై సవివరమైన సమీక్షను సమర్పించారు.

'నషా ముక్త్ జమ్మూ కాశ్మీర్ 100 రోజుల అభియాన్' కింద, పలు శాఖల సమన్వయంతో కూడిన ప్రయత్నాల ద్వారా విస్తృత ప్రజా ప్రచారాన్ని నిర్వహించినట్లు శాఖ నివేదించింది. కేంద్రపాలిత ప్రాంతం వ్యాప్తంగా 72.1 లక్షలకు పైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా, వ్యసన చికిత్సా కేంద్రాలు 66,594 మంది ఔట్‌పేషెంట్లకు చికిత్స అందించాయని వెల్లడైంది.

# తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి



నల్గొండ, అక్టోబర్ 23:యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ మండలం రెడ్ల రేపాక గ్రామానికి చెందిన గీత కార్మికుడు కొండం శంకరయ్య గౌడ్ (70) శుక్రవారం ఉదయం తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు.

కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. శంకరయ్య ప్రతిరోజూ లాగే ఉదయం కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. దీంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, గీత కార్మికులకు అందించే ప్రమాద బీమాతో పాటు తగిన ఎక్స్‌గ్రేషియా వెంటనే మంజూరు చేయాలని గ్రామస్తులు, గౌడ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

# అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

నల్గొండ, అక్టోబర్ 23: సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండలం ఏపూరు గ్రామం బోడ తండాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. తండాకు చెందిన బోడ ప్రణీత (17), అనే యువతి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది.

పక్క తండాకు చెందిన నరేష్ అనే యువకుడి వేధింపుల వల్లే తమ కుమార్తె ప్రాణాలు కోల్పోయిందని, అతడే ఆమెను ట్రాన్స్‌ఫార్మర్‌పైకి నెట్టి చంపాడని ప్రణీత తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ప్రణీత మృతికి వేధింపులే కారణమా లేక వేరే ఏదైనా ఉందా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, నిజానిజాలు వెలికితీయాలని స్థానికులు కోరుతున్నారు.

# పారిశుధ్య కార్మికుల సంక్షేమం, పునరావాసం మరియు భద్రతా చర్యలను కేంద్ర మంత్రి డా. వీరేంద్ర కుమార్ సమీక్ష



న్యూఢిల్లీ, అక్టోబర్ 23:సామాజిక న్యాయం మరియు సాధికారత శాఖ కేంద్ర మంత్రి డా. వీరేంద్ర కుమార్, పారిశుధ్య కార్మికుల సంక్షేమం, పునరావాసం, భద్రత మరియు సాధికారతకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించేందుకు, అక్టోబర్ 22, 2026న జాతీయ పారిశుధ్య కర్మచారి కమిషన్ అధికారులతో సమావేశమయ్యారు.

ఈ సమావేశానికి ఎన్‌సిఎస్‌కె (ఔఊఐ) ఛైర్‌పర్సన్ శ్రీ భగవత్ ప్రసాద్ మక్వానా; సభ్యులు శ్రీ మనోజ్ కుమార్ బాల్మీకి; సభ్యులు శ్రీ రవి రాము కలోసే; మరియు కమిషన్ సభ్యురాలు (శ్రీమతి) డా. సుష్మా గౌడియాల్ హాజరయ్యారు. మంత్రిత్వ శాఖకు చెందిన సంబంధిత జాయింట్ సెక్రటరీలు కూడా పాల్గొన్నారు.

ఈ సమావేశంలో, పారిశుధ్య కార్మికుల సంక్షేమం మరియు పునరావాసం కోసం చేపట్టాల్సిన వివిధ చర్యలపై వివరంగా చర్చించారు.

ముఖ్యంగా పని పరిస్థితులను మెరుగుపరచడం, వృత్తిపరమైన భద్రతను నిర్ధారించడం మరియు వారి సామాజిక–ఆర్థిక సాధికారతను ప్రోత్సహించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.

పారిశుధ్య కార్మికుల నైపుణ్యాలను మెరుగుపరచడానికి, సురక్షితమైన పని పద్ధతులను ప్రోత్సహించడానికి మరియు వారు గౌరవప్రదంగా, సురక్షితంగా పారిశుధ్య సంబంధిత కార్యకలాపాలను చేపట్టేలా వారికి తగిన శిక్షణ అందించాల్సిన అవసరాన్ని డా. వీరేంద్ర కుమార్ నొక్కి చెప్పారు.

మంత్రిత్వ శాఖ యొక్క 'నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్ (నమస్తే)' పథకం యొక్క నిబంధనలు మరియు ప్రయోజనాలపై విస్తృత అవగాహన కల్పించాల్సిన ప్రాముఖ్యతను కూడా ఆయన నొక్కి చెప్పారు, తద్వారా దేశవ్యాప్తంగా ఎక్కువ మంది అర్హులైన లబ్ధిదారులు దాని ప్రయోజనాలను పొందగలరు.


తెలంగాణ సాహిత్య అకాడమి
సౌజన్యంతో
తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల సంఘం (ట్రస్మ)
సహకారంతో
డా. మాడభూషి రంగాచార్య స్మారక సంఘం
నిర్వహిస్తున్న
**బడి, పిల్లలు, సృజనాత్మక రచన – గ్రంథాలయాలు ఒకరోజు కార్యశాల**
(ఉపాధ్యాయులు-బాల సాహితీవేత్తల కార్యశాల)
25 అక్టోబర్, 2026 ఆదివారం, ఉ. 10.00 గం నుండి సా. 4.30 వరకు
ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్, వీధి నెం. 13, హిమాయత్ నగర్, హైదరాబాద్, తెలంగాణ
**ప్రారంభ సభ : ఉదయం 9.45 నుండి 11.00 వరకు**
అధ్యక్షులు
శ్రీ గరిపెల్లి అశోక్
కన్వీనర్ గరిపెల్లి-పత్తిపాక ఫౌండేషన్, బాలవికాస కార్యకర్త, సిద్ధిపేట
ముఖ్య అతిథి
డా. నామోజు బాలాచారి
కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి, తెలంగాణ ప్రభుత్వం
ప్రధాన ప్రసంగం
డా. పత్తిపాక మోహన్
దక్షిణప్రాంత అధికారి, నేషనల్ బుక్ ట్రస్ట్, భారత ప్రభుత్వం
కేంద్ర సాహిత్య అకాడమి బాల సాహిత్య పురస్కార గ్రహీత
విశిష్ట అతిథి
శ్రీ సద్దుల మధుసూదన్
అధ్యక్షులు, ట్రస్మా, తెలంగాణ
సభా సమన్వయం: డా. హారిక చెరుకుపల్లి బాల సాహితీవేత్త
మాడభూషి లలితా దేవి
కన్వీనర్, మాడభూషి రంగాచార్య స్మారక సంఘం, హైదరాబాద్ & సభ్యులు

# ఎస్సారెస్పీ నీటితో నిండుకుండలా ఇందిరమ్మ వరద కాలువ..

**యాసంగి సాగుకు కొండంత భరోసా!**
**18 గ్రామాలకు ప్రయోజనం..**
**1,529 ఎకరాల ఆయకట్టుకు లభించనున్న సాగునీరు**

నిజామాబాద్, అక్టోబర్ 23:శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన నీటితో ఇందిరమ్మ వరద కాలువ



నిండుకుండలా మారింది. దీంతో బాల్కొండ నియోజకవర్గ రైతులకు రాబోయే యాసంగి సాగుకు కొండంత ఊరట లభించినట్లయ్యింది. కాలువలో కిలోమీటర్ 0.0 నుంచి 27.85 వరకు సుమారు 0.3 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ నెల 21 నుంచి ఎనిమిది తూముల ద్వారా 16 చెరువులు, 3 చెక్‌డ్యాంలకు నీటిని విడుదల చేయడంతో పరివాహక ప్రాంతంలో జలకళ సంతరించుకుంది.

వరద కాలువ నీటి విడుదలతో 18 గ్రామాల పరిధిలోని సుమారు 1,529 ఎకరాల ఆయకట్టుకు నేరుగా ప్రయోజనం చేకూరనుంది. కాలువకు ఇరువైపులా భూగర్భజలాలు భారీగా పెరిగి, సమీపంలోని దాదాపు 600 బోరుబావులకు మళ్లీ జలకళ రానుంది. ముప్కాల్, బస్సాపూర్, కిసాన్‌నగర్, వేంపల్లి, బోదేపల్లి, వన్నెల్ (బి), పడగల్, పోచంపల్లి, అంక్సాపూర్, ధర్మోరా, దొనకల్, గాండ్లపేట్, పాలెం, వెల్గాడ్, తిమ్మాపూర్, ఉప్లూర్, కమ్మర్‌పల్లి, నాగాపూర్ గ్రామాల రైతులకు ఈ నీరు ఎంతో ఆసరాగా నిలవనుంది.

**45 టీఎంసీల్లో 9 టీఎంసీలు సాగుకే కేటాయింపు..**

ఈ సీజన్‌లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 45 టీఎంసీల నీరు అందుబాటులో ఉండగా.. ముందస్తు పంటలను కాపాడేందుకు ప్రభుత్వం ఒక తడి సాగునీటిని విడుదల చేసింది. కాకతీయ, సరస్వతి, లక్ష్మీ, వరద కాలువలతో పాటు అలీసాగర్, గుత్ప ఎత్తిపోతల ద్వారా ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు మొత్తం 9 టీఎంసీల నీటిని సాగు అవసరాలకు అందించారు.

**మిగిలిన 36 టీఎంసీలు తాగునీటికే ప్రాధాన్యం..**

ప్రస్తుతం ప్రాజెక్టులో 1,076.50 అడుగుల నీటిమట్టంతో 36 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ నీటిని రాబోయే రోజుల్లో తాగునీటి అవసరాలకే కేటాయించనున్నారు. కొత్తగా సాగునీటి విడుదలకు అవకాశం లేకపోయినా, ఇందిరమ్మ వరద కాలువలో ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు, చెరువులు, చెక్‌డ్యాంలను చేరిన జలాలతో 2026?27 యాసంగి సీజన్‌లో ఆరుతడి పంటలు సాగు చేసుకునేందుకు స్థానిక రైతులకు ఊరట లభించింది.

# వెంకంపల్లిలో చిరుత సంచారం.. నెల రోజుల్లో రెండోసారి

కామారెడ్డి, అక్టోబర్ 23 :(నేటినిజం ప్రతినిధి): కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం వెంకంపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం చిరుతపులి సంచరించడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న వాటర్ ట్యాంక్ వెనుక ఉన్న గుట్ట రాయిపై చిరుత దర్జాగా కూర్చొని కనిపించింది. దీనిని గమనించిన స్థానికులు భయంతో కేకలు వేశారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని కేకలు వేయడంతో చిరుత గుట్ట పైనుంచి కిందకు దిగింది. వెంటనే గ్రామానికి చెందిన యువకులు కేకలు వేస్తూ, అల్లరి చేస్తూ చిరుతను తరిమివేశారు. దీంతో ఆ చిరుత అక్కడి నుంచి అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయిందని గ్రామస్తులు తెలిపారు.

సుమారు నెల రోజుల క్రితం కూడా గ్రామంలో చిరుత సంచరించి కనిపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అయితే అప్పుడు అది చిరుత కాదని అటవీశాఖ అధికారులు కొట్టిపారేశారు. కానీ, ఇప్పుడు మరోసారి స్పష్టంగా చిరుత కనిపించడంతో గ్రామస్తులు వణుకుతున్నారు. చిరుత సంచరించిన ప్రాంతంలో వెంకంపల్లి, తాండూర్, లింగంపల్లి గ్రామాలకు చెందిన రైతుల వంట భూములు ఉన్నాయి. ప్రస్తుతం వరి కోతల సమయం కావడంతో పొలాలకు వెళ్లాలంటేనే రైతులు జంకుతున్నారు.

ఈ విషయమై నాగిరెడ్డిపేట అటవీశాఖ రేంజ్ అధికారి వానుదేవ్ మాట్లాడుతూ.. గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం 7 గంటల వరకు రైతులు, కూలీలు ఒంటరిగా పొలాల వద్దకు వెళ్లకూడదని సూచించారు. ఈ సమయంలో ఎవరికైనా చిరుత కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

# జపాన్ మరియు జర్మనీలలో ఉపాధి అవకాశాల కోసం యువతకు జపనీస్ మరియు జర్మన్ భాషా శిక్షణ




న్యూ ఢిల్లీ, అక్టోబర్ 23:భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపకత శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) మరియు విద్యా శాఖ సహాయ మంత్రి శ్రీ జయంత్ చౌదరి, ముంబైలోని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ యొక్క సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ వేదికపై నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అరంగేట్రాన్ని గుర్తించే, గంట మోగించే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా, సుస్థిర జీవనోపాధి అనే ఉమ్మడి లక్ష్యం చుట్టూ ప్రభుత్వ నిధులు, ప్రైవేట్ కార్పొరేట్ సామాజిక బాధ్యత , రిటైల్ ఇన్వెస్టర్ క్యాపిటల్ మరియు ప్రత్యేక శిక్షణా సామర్థ్యాలను మేము ఏకతాటిపైకి తీసుకువస్తున్నాము.

ఈ సందర్భంగా, వినూత్న నైపుణ్యాభివృద్ధి మరియు ప్రపంచ ఉపాధి కార్యక్రమం కోసం నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ×4 కోట్లు సబ్‌స్క్రైబ్ చేయగా, ఇష్యూ తొలిసారిగా జీరో కూపన్ జీరో ప్రిన్సిపల్ సాధనాలను జారీ చేసింది. ఈ కార్యక్రమం మధ్యప్రదేశ్‌లోని ఆర్థికంగా వెనుకబడిన ఇతర వెనుకబడిన తరగతుల కుటుంబాలకు చెందిన 600 మంది యువతకు మద్దతు నిస్తూ, వారిని అంతర్జాతీయ ఉపాధి అవకాశాలకు సిద్ధం చేస్తుంది.

ఈ కార్యక్రమానికి శ్రీమతి హాజరయ్యారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వ వెనుకబడిన తరగతులు మరియు మైనారిటీల సంక్షేమ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) కృష్ణ గౌర్; మహారాష్ట్ర ప్రభుత్వ నైపుణ్యాలు, ఉపాధి, వ్యవస్థాపకత మరియు ఆవిష్కరణల శాఖ మంత్రి శ్రీ మంగళ్ ప్రభాత్ లోధా మహారాష్ట్ర ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీమతి మనీషా వర్మ; భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీమతి మనీషా సెన్శర్మ; నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ శ్రీ ఆశిష్‌కుమార్ చౌహాన్; నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ అరుణ్‌కుమార్ పిళ్ళై; నాబార్డ్ ఛైర్మన్ డా. షాజీ కృష్ణన్ శ్రీరామ్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ అలోక్ శ్రీరామ్, భాగస్వామ్య సంస్థల ప్రతినిధులతో పాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నాణ్యమైన శిక్షణ, స్థిరమైన జీవనోపాధి మరియు ప్రపంచ కార్మిక శక్తి అవకాశాలకు ప్రాప్యతను విస్తరించడంలో సామాజిక ఆర్థిక మరియు సహకార సంస్థాగత ఫ్రేమ్‌వర్క్‌ల పెరుగుతున్న పాత్రను ఈ కార్యక్రమం హైలైట్ చేసింది.

సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపకత శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) మరియు విద్యా శాఖ సహాయ మంత్రి శ్రీ జయంత్ చౌదరి ఇలా అన్నారు: "భారత దేశ వృద్ధికి అనుగుణంగా ప్రజలపై పెట్టుబడులు పెట్టాలి. ప్రభుత్వం అందుకు వీలు కల్పించే వ్యవస్థను సృష్టించగలదు, కానీ పెద్ద ఎత్తున అభివృద్ధికి నిధులు సమకూర్చడానికి ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్ నిధులు సమకూర్చేవారు మరియు దాతలు కలిసి పనిచేయడం అవసరం. సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఈ సామూహిక నిబద్ధతను విశ్వసనీయమైన ప్రాజెక్టులు, పారదర్శకత మరియు ధృవీకరించదగిన ఫలితాలతో అనుసంధానిస్తుంది. నైపుణ్యాలలో పెట్టుబడిని ప్రపంచ వ్యాప్త ఉపాధి అవకాశాలుగా మరియు స్థిరమైన జీవనోపాధులుగా మార్చే భాగస్వామ్యాన్ని నిర్మించినందుకు ఎన్ఎస్‌డిసి, నాబార్డ్, ఎన్ఎస్ఇ, మధ్యప్రదేశ్ ప్రభుత్వం మరియు సహకరించిన వారందరినీ నేను అభినందిస్తున్నాను."

శ్రీమతి. మధ్యప్రదేశ్ ప్రభుత్వ వెనుకబడిన తరగతులు మరియు మైనారిటీల సంక్షేమ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) కృష్ణ గౌర్ మాట్లాడుతూ: "నాణ్యమైన శిక్షణ మరియు ఉపాధి పొందడంలో ఆర్థిక, సామాజిక అడ్డంకులను ఎదుర్కొంటున్న వెనుకబడిన తరగతుల యువతకు అవకాశాలను విస్తరించడానికి మధ్యప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఎన్ఎస్‌డిసితో ఈ భాగస్వామ్యం మన రాష్ట్రానికి చెందిన 600 మంది యువతకు అంతర్జాతీయంగా ఉపయోగపడే నైపుణ్యాలను సంపాదించి, జపాన్ మరియు జర్మనీలలో ఉపాధికి సిద్ధమయ్యే అవకాశాన్ని కల్పిస్తుంది. ప్రభుత్వ నిధులు విజయవంతమైన ఉద్యోగ కల్పన ఫలితాలతో ముడిపడి ఉన్న ఈ నమూనాకు మద్దతు ఇవ్వడం మాకు సంతోషంగా ఉంది. ఈ కార్యక్రమం పాల్గొనే కుటుంబాలకు ఆర్థిక స్వాతంత్ర్యం మరియు మెరుగైన జీవనోపాధి దిశగా ఒక విలువైన మార్గాన్ని అందిస్తుందని మేము విశ్వసిస్తున్నాము."

## పెట్టుబడిని ఉపాధి ఫలితాలతో అనుసంధానించే వినూత్న ఆర్థిక సహాయ నమూనా

సుమారు -11.25 కోట్ల వ్యయంతో కూడిన ఈ కార్యక్రమం, మూడు పరస్పర పూరక నిధుల వనరులను కలిపే మిశ్రమ-ఆర్థిక సహాయ నిర్మాణాన్ని అవలంబిస్తుంది. కార్యక్రమ వ్యయంలో 15 శాతం లబ్ధిదారుల భాగస్వామ్యం నుండి, 35 శాతం సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ద్వారా సమీకరించిన ఆర్థిక సహాయం నుండి, మరియు మిగిలిన 50 శాతం అభ్యర్థులకు అంతర్జాతీయ ఉపాధి విజయవంతంగా లభించిన తర్వాత మధ్యప్రదేశ్ ప్రభుత్వం నుండి సమకూరుతుంది.

ఫలిత-ఆధారిత భాగం, ప్రభుత్వ వ్యయాన్ని కొలవగల ఉపాధి ఫలితాలతో అనుసంధానిస్తూ, మధ్యప్రదేశ్ ప్రభుత్వం మధ్య ద్వైపాక్షిక సోషల్ ఇంపాక్ట్ బాండ్ ఫ్రేమ్‌వర్క్ కింద రూపొందించబడింది. అభ్యర్థుల సమీకరణ, నివాస శిక్షణా మౌలిక సదుపాయాలు మరియు భాషా ప్రయోగశాలలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇస్తుంది.

Ôáఫ్రేమ్‌వర్క్, నిధుల పారదర్శక వినియోగం మరియు సామాజిక ఫలితాల నివేదనకు ప్రాధాన్యతనిస్తూ, అర్హతగల సామాజిక ప్రయోజన సంస్థలు సంప్రదాయ వడ్డీ లేదా అసలు తిరిగి చెల్లించే బాధ్యతలు లేకుండా వనరులను సమీకరించుకోవడానికి వీలు కల్పిస్తుంది.

ఈ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యత గురించి మాట్లాడుతూ, ఎంఎస్‌డిఇ అదనపు కార్యదర్శి శ్రీమతి మనీషా సెన్శర్మ ఇలా అన్నారు, "ప్రజా విధాన దృక్కోణం నుండి, ఈ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యత దాని ఆర్థిక నిర్మాణం మరియు జవాబుదారీతనం చట్రంలో ఉంది. స్పష్టంగా నిర్వచించబడిన అభివృద్ధి ఫలితాలకు మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వ వనరులను సంస్థాగత మరియు సామాజిక పెట్టుబడితో ఎలా కలపవచ్చో ఇది చూపిస్తుంది. పటిష్టమైన పాలన, పారదర్శక నివేదన మరియు కొలవగల ఫలితాలను పాటిస్తూనే, వినూత్న ఆర్థిక సాధనాలను అన్వేషించడానికి ఎన్ఎస్‌డిసి చేస్తున్న ప్రయత్నాలను మంత్రిత్వ శాఖ స్వాగతిస్తుంది. ఈ కార్యక్రమం నుండి పొందిన అనుభవం, భవిష్యత్తులో ఫలిత-ఆధారిత నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను రూపొందించడానికి మరియు విస్తరించడానికి ఉపయోగకరమైన పాఠాలను అందిస్తుంది."

## సంస్థాగత భాగస్వామ్యాలను బలోపేతం చేయడం

గ్రామీణాభివృద్ధి ఆర్థిక సహాయానికి మరియు అంతర్జాతీయ కార్మిక శక్తి చలనశీలత ద్వారా అందుబాటులో ఉన్న విస్తరిస్తున్న అవకాశాలకు మధ్య ఒక ముఖ్యమైన సంగమాన్ని నాబార్డ్ భాగస్వామ్యం సూచిస్తుంది. అధిక సంపాదన సామర్థ్యం, ??పెరిగిన గృహ పొదుపు మరియు నిరంతర జీవనోపాధి మెరుగుదలకు మార్గాలను సృష్టించడం ద్వారా ఆర్థికంగా బలహీనమైన గ్రామీణ కుటుంబాలకు మద్దతు ఇవ్వాలని ఈ కార్యక్రమం కోరుకుంటుంది.

నాబార్డ్ ఛైర్మన్ డాక్టర్ షాజీ కృష్ణన్ వి. మాట్లాడుతూ, "సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఇష్యూలో నాబార్డ్ పాల్గొనడం అనేది, వినూత్న అభివృద్ధి-ఆర్థిక నమూనాలను అన్వేషించాలనే మా నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. ఈ చొరవ, కొలవదగిన సామాజిక ప్రభావాన్ని అందించడంలో వినూత్న ఆర్థిక నమూనాల సామర్థ్యాన్ని ప్రదర్శిస్తూనే, సంస్థాగత మరియు ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని మరింతగా ప్రోత్సహిస్తుందని మేము ఆశిస్తున్నాము. అంతిమంగా, అభివృద్ధి ఆర్థిక సహాయం యొక్క నిజమైన కొలమానం సమీకరించిన మూలధనం మొత్తంలో లేదు, కానీ అది ఎంత ప్రభావవంతంగా అవకాశాలుగా, స్థిరమైన జీవనోపాధులుగా మరియు ప్రజల జీవితాలలో శాశ్వతమైన మెరుగుదలలుగా రూపాంతరం చెందిందనే దానిలో ఉంది."

ఎన్ఎస్‌డిసి సీఈఓ శ్రీ అరుణకుమార్ పిళ్ళై మాట్లాడుతూ, "నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి సంబంధిత కార్యక్రమాలకు ఆర్థిక సహాయాన్ని వైవిధ్యపరచాలనే మా ప్రయత్నాలలో, సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఎన్ఎస్‌డిసి అరంగేట్రం చేయడం ఒక ముఖ్యమైన ముందడుగు. ఈ కార్యక్రమం ద్వారా, సుస్థిర జీవనోపాధి అనే ఉమ్మడి లక్ష్యం చుట్టూ మేము ప్రభుత్వ మద్దతు, సంస్థాగత మూలధనం మరియు ప్రత్యేక శిక్షణా సామర్థ్యాలను ఏకతాటిపైకి తీసుకువస్తున్నాము. మాపై నమ్మకం ఉంచి, సహకరించినందుకు నాబార్డ్, ఎన్ఎస్ఈ, మధ్యప్రదేశ్ ప్రభుత్వం మరియు మా భాగస్వాములకు మేము కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ఇకపై మా దృష్టి సమర్థవంతమైన అమలు, ధృవీకరించదగిన ఫలితాలు మరియు సామాజిక ఆర్థిక సహాయంలో అధిక భాగస్వామ్యాన్ని ఆకర్షించగల కార్యక్రమాల పోర్ట్‌ఫోలియోను నిర్మించడంపై ఉంటుంది" అని అన్నారు.

# 'భారత్‌తో కలిసి నిర్మించండి, ఆవిష్కరించండి, వృద్ధి చెందండి' అని పోలిష్ సంస్థలకు కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ ఆహ్వానం

న్యూఢిల్లీ, అక్టోబర్ 23:కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్, ఇరు దేశాల వ్యాపార నాయకులకు భారతదేశపు వృద్ధి గాథను వివరిస్తూ, కేవలం భారతదేశానికి అమ్మకాలు జరపడమే కాకుండా "భారత దేశంలో నిర్మించండి, ఆవిష్కరించండి, పెట్టుబడులు పెట్టండి" అని పోలిష్ కంపెనీలను కోరారు.

కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ ఈ రోజు ఇక్కడ జరిగిన భారత్-పోలాండ్ బిజినెస్ ఫోరంలో కీలకోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమానికి పోలాండ్ ప్రధాన మంత్రి డొనాల్డ్ టస్క్ కూడా హాజరయ్యారు. 2024 ఆగస్టులో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పోలాండ్‌లో పర్యటించడం ఇరు దేశాల సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి తీసుకువెళ్లిందని సోనోవాల్ గుర్తు చేశారు.

2024 ఆగస్టులో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పోలాండ్‌లో పర్యటించినప్పుడు, ఆయన మరియు ప్రధానమంత్రి టస్క్ మన సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి ఉన్నతీకరించారు. వారు ఒక స్పష్టమైన నిశ్చయంతో అలా చేశారు: భారత్-పోలాండ్ సంబంధం కేవలం దౌత్యంలోనే కాకుండా, వ్యాపారం, సాంకేతికత, పెట్టుబడి మరియు ఆవిష్కరణలలో కూడా బలంగా ఉండాలి," అని సర్బానంద సోనోవాల్ అన్నారు. దౌత్యంలో ఎంత బలంగా ఉందో, వ్యాపారం, సాంకేతికత, పెట్టుబడి మరియు ఆవిష్కరణలలో కూడా అంతే బలంగా ఉండటమే ఇప్పుడు తమ లక్ష్యమని ఆయన అన్నారు."భారత్, విస్తరిస్తున్న పెద్ద మార్కెట్ యొక్క విస్తృతిని, యువ మరియు ప్రతిభావంతులైన శ్రామిక శక్తి యొక్క నైపుణ్యాలను, మరియు సంస్కరణలు, వ్యవస్థాపకత, స్వేచ్ఛకు కట్టుబడి ఉన్న ప్రజాస్వామ్యం యొక్క విశ్వాసాన్ని అందిస్తుంది," అని సోనోవాల్ అన్నారు.

ఈ రెండు ఆర్థిక వ్యవస్థలు ఒకదానికొకటి సరిపోతాయని సోనోవాల్ వాదించారు. ఇంజనీరింగ్, యంత్రాలు, మైనింగ్ టెక్నాలజీలు, రవాణా, పర్యావరణ పరిష్కారాలు మరియు అధునాతన తయారీ రంగాలలో పోలాండ్‌కు బలాలు ఉన్నాయని ఆయన అన్నారు. ఆ సామర్థ్యాలను విస్తృతం చేయడానికి అవసరమైన మార్కెట్, ప్రతిభ మరియు తయారీ రంగం భారతదేశానికి ఉన్నాయి. "పోలిష్ కంపెనీలకు నా సందేశం ఏమిటంటే: కేవలం భారతదేశానికి అమ్మడమే కాదు. భారతదేశంలోనే ఉత్పత్తి చేయండి. భారతదేశంలోనే పరిష్కారాలను అభివృద్ధి చేయండి. భారతీయ భాగస్వాములను కనుగొనండి. మరియు, మీ వృద్ధికి భారతదేశాన్ని ఒక వేదికగా ఉపయోగించుకోండి," అని సోనోవాల్ అన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి చైతన్యవంతమైన నాయకత్వంలో, దేశం ఒక బలమైన వాతావరణ కార్యాచరణ చర్యగా, 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజేతర ఇంధన విద్యుత్ సామర్థ్యాన్ని ఉత్పత్తి చేయాలనే ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని భారతదేశం నిర్దేశించుకుందని సోనోవాల్ పేర్కొన్నారు. దీనికి సుమారుగా 280 బిలియన్ల నుంచి 300 బిలియన్ల యూరోల పెట్టుబడి అవసరమని, పరికరాల తయారీదారులు, నిల్వ, పవర్ గ్రిడ్‌లు, గ్రీన్ హైడ్రోజన్, రీసైక్లింగ్ మరియు పర్యావరణ సాంకేతికత వంటి రంగాలకు అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. మైనింగ్, కీలక ఖనిజాలు మరియు స్వచ్ఛ ఇంధన రంగాలలో పోలాండ్ అనుభవం సహాయపడగలదని సోనోవాల్ అన్నారు.

సాంకేతికత విషయానికి వస్తే, భారతీయ ఐటీ కంపెనీలు తమ యూరోపియన్ కార్యకలాపాలకు పోలాండ్‌ను కేంద్రంగా చేసుకున్నాయని, అక్కడ సుమారు 10,000 మందికి ఉపాధి కల్పిస్తున్నాయని సోనోవాల్ పేర్కొన్నారు. తదుపరి అడుగు ఐటీ సేవలకు అతీతంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్, 5జీ అప్లికేషన్లు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ మరియు అంతరిక్ష రంగాల వైపు ఉండాలని ఆయన అన్నారు.

రెండు దేశాల్లోని వ్యాపారాలు, పరిశోధకులు మరియు ఆవిష్కర్తలను అనుసంధానించడానికి కేంద్ర మంత్రి ఒక స్టార్టప్ బ్రిడ్జ్, ఒక ఇన్నోవేషన్ కారిడార్ మరియు ఒక ఏఐ మరియు క్వాంటం డైలాగ్‌ను ప్రతిపాదించారు. రెండు దేశాల మధ్య వాణిజ్యం 6.36 బిలియన్ డాలర్లకు చేరుకుందని, పోలాండ్‌లో భారత పెట్టుబడులు 3 బిలియన్ డాలర్లను మించి ఉన్నాయని సోనోవాల్ అన్నారు. ప్యాకేజింగ్, తయారీ, వ్యర్థాల నుండి శక్తి, ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగాలలో పోలిష్ కంపెనీలు కూడా భారతదేశంలో చురుకుగా ఉన్నాయి.




# ఇందిరమ్మ ఇళ్లను సకాలంలో నిర్మించుకోవాలి

**లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ..**
**ఊట్కూర్‌లో రెండో విడతలో 35 ఇళ్లు మంజూరు**

మహబూబ్‌నగర్, అక్టోబర్ 23: ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను సకాలంలో ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఊట్కూర్ ఎంపీడీవో పావని, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూర్యప్రకాష్ రెడ్డి సూచించారు. శుక్రవారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత లబ్ధిదారులకు వారు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకం కింద ఇళ్లు మంజూరైన వారు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. నిర్దేశించిన గడువులోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని కోరారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం చేయకుండా, సంబంధిత అధికారులు సూచించిన విధంగా పనులు కొనసాగించాలని తెలిపారు.

రెండో విడతలో ఊట్కూర్‌కు 28 ఇళ్లు, పెద్దపోర్లకు ఆరు ఇళ్లు, పులిమామిడికి ఒక ఇల్లు మంజూరైనట్లు వెల్లడించారు. మొత్తం 35 ఇళ్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సొంతింటి కలను నెరవేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ ప్రేమ, మాజీ మండల అధ్యక్షుడు యజ్ఞేశ్వర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ రమేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కోరం మహేష్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొక్కులింగం, భవన నిర్మాణ సంఘం మండల అధ్యక్షుడు కూతలి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమలో ప్రమాదం విచారకరం

సంగారెడ్డి, అక్టోబర్ 23:(నేటినిజం ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని సరాక రసాయన పరిశ్రమలో గ్యాస్ లీక్ అయి ఇద్దరు కార్మికులు మృతి చెందడం తీవ్ర విషాదకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, మృతుల కుటుంబాలకు కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. పరిశ్రమల్లో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గం. నాడు సిగాచి.. నేడు సరాక పరిశ్రమలో ప్రమాదం. గత చేదు అనుభవాల నుండి ఈ ప్రభుత్వం ఏం నేర్చుకోదా . కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం అమాయక కార్మికుల ప్రాణాలను బలితీసుకుంటోంది. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలు ప్రశ్నార్థకంగా మారగా, అధికారుల పర్యవేక్షణ లేకుండా పోయింది. ప్రమాదం జరిగిన తర్వాత వచ్చి ఫోటోలకు ఫోజులు ఇవ్వడం తప్ప.. కార్మికుల ప్రాణాలకు భరోసా కల్పించేందుకు మీరు చేస్తున్నదేమిటి? భద్రతా ప్రమాణాలు పాటించకుండా కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పరిశ్రమల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకునేదెప్పుడు. సరాక పరిశ్రమ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ప్రమాదానికి బాధ్యులైన కంపెనీ యాజమాన్యం పై కఠిన చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పరిశ్రమల్లో భద్రతా చర్యలు పటిష్టం చేయాలి. ఉపాధి కోసం వచ్చిన అమాయక కార్మికుల ప్రాణాలకు ప్రభుత్వం భరోసా కల్పించాలి. సిగాచి ఘటనలో ఇంటి పెద్దను కోల్పోయిన 54 మంది కార్మిక కుటుంబాలం దరికీ సీఎం స్వయంగా ప్రకటించిన కోటి రూపాయల పరిహారాన్ని ఇప్పటికైనా అందించి మాట నిలుపుకోవాలి.

# సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో ఈ నెల 26 - 27 తేదీల్లో 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం సమావేశం: లోక్‌సభ స్పీకర్

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 23:12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్‌కు 2026 అక్టోబర్ 26, 27 తేదీల్లో సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో భారత పార్లమెంటు ఆతిథ్యమివ్వనుంది. ఈ సదస్సు అక్టోబర్ 26న ప్రారంభమవుతుంది.

లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా ఈ రోజు పార్లమెంట్ హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఈ సదస్సు భారత పార్లమెంటరీ దౌత్య చరిత్రలో ఒక నూతన అధ్యాయానికి నాంది పలుకుతుందని తెలిపారు. ఈ సదస్సులో బ్రిక్స్ సభ్య, భాగస్వామ్య దేశాలకు చెందిన సభాపతులు, పార్లమెంటరీ నేతలు, కేంద్ర మంత్రులు, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ శ్రీ హరివంశ్, రాష్ట్ర శాసనసభల సభాపతులు, పార్లమెంటు సభ్యులు, ఇతర ప్రముఖులు పాల్గొననున్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ సమావేశంలో పాల్గొని పర్యటనకు వచ్చిన ప్రతినిధి బృందాల నాయకులతో సమావేశమవుతారని లోక్‌సభ స్పీకర్ తెలిపారు.

విదేశాల నుంచి విచ్చేసిన ప్రతినిధి బృందాల నాయకులతోనూ, పార్లమెంటరీ మైత్రీ బృందాలతోనూ ఈ సదస్సు వేదికగా ద్వైపాక్షిక, బహుపాక్షిక సమావేశాలు జరగనున్నాయని ఆయన వెల్లడించారు. 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్ సంయుక్త ప్రకటనను ఖరారు చేసేందుకు గాను సదస్సు ప్రతినిధి బృందాల కార్యదర్శుల సమావేశం 2026 అక్టోబర్ 25న జరుగుతుందని ఆయన తెలిపారు.

కార్యక్రమ ప్రధాన ఇతివృత్తాన్ని వివరిస్తూ, "ప్రజాకేంద్రిత అభివృద్ధి కోసం పార్లమెంట్లను బలోపేతం చేయడం" అనే విస్తృత అంశంపై ఈ ఫోరమ్‌లో చర్చలు జరుగుతాయని స్పీకర్ తెలిపారు.

బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్ గత సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్ నాలుగు ఉన్నతస్థాయి సమావేశాల ద్వారా ఏకాభిప్రాయ ఆధారిత చర్చలకు వేదికగా నిలుస్తుందని ఆయన తెలిపారు. ఆ నాలుగు సమావేశాలు ఇవి:

స్థిరత్వం: మెరుగైన భవిష్యత్తుకు భరోసా కల్పించేలా సంస్థలను బలోపేతం చేయడంలో పార్లమెంట్ల కీలక పాత్ర.

ఆవిష్కరణ: పార్లమెంట్ల ద్వారా కృత్రిమ మేధస్సు, డిజిటల్ సాంకేతికతల్లో మానవకేంద్రిత ఆవిష్కరణలను ప్రోత్సహించడం.

సహకారం: పార్లమెంటరీ సహకారం ద్వారా ప్రపంచ పాలనలో మరింత ప్రాతినిధ్యంతో కూడిన వ్యవస్థను నిర్ధారించడం.

సుస్థిరత: మన దేశాలకు సుస్థిరమైన, సమ్మిళిత భవిష్యత్తును అందించడంలో పార్లమెంట్ల పాత్ర.

బ్రిక్స్ సభ్య, భాగస్వామ్య దేశాల పార్లమెంట్ల అంతర్జాతీయ వ్యవహారాల కమిటీల అధ్యక్షులతో ప్రత్యేక సమావేశం కూడా నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో పార్లమెంటరీ దౌత్యం, సామర్థ్యాల పెంపు, ఉత్తమ విధానాల పరస్పర మార్పిడిపై చర్చించనున్నారు.

ఉన్నతస్థాయి ప్లీనరీ సమావేశాలు, సమాంతర సమావేశాలు, ద్వైపాక్షిక చర్చలతో పాటు సాంస్కృతిక కార్యక్రమం కూడా సదస్సులో భాగంగా ఉంటుందని శ్రీ బిర్లా తెలిపారు. విశిష్ట అతిథుల గౌరవార్థం భారత ఉపరాష్ట్రపతి విందు ఏర్పాటు చేయనున్నారు.

ప్రతినిధి బృందాల సభ్యులు భారత పార్లమెంటును సందర్శించడంతో పాటు, ఢిల్లీలోని సాంస్కృతిక ప్రదేశాలను కూడా సందర్శిస్తారు. ఈ సదస్సు అక్టోబర్ 27న ముగుస్తుంది.

# అమరవీరుల త్యాగాలు మరులేనివి..

## –జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

కరీంనగర్, అక్టోబర్ 23: విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని, అవి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి.గితే



పేర్కొన్నారు.

మ్యాప్‌లు చూడండి

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా శుక్రవారం సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో విద్యార్థుల కోసం 'ఓపెన్ హౌస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలు, శాఖ పనితీరు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే ఈ ఓపెన్ హౌస్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పోలీసులు నిర్వహించే డే ఉ నైట్ బీట్స్, పెట్రోలింగ్ విధానాలు, ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియ, నేరాల నివారణలో సీసీ కెమెరాల ప్రాధాన్యం గురించి విద్యార్థులకు కూలంకషంగా వివరించారు. అలాగే మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం పనిచేస్తున్న 'షీ టీమ్స్, భరోసా ' సేవల గురించి తెలిపారు.

వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటివి చేయకూడదని హెచ్చరించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏమైనా మోసాలు జరిగితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీ కోర్, భరోసా కేంద్రం, షీ టీమ్స్, ఫింగర్ ప్రింట్స్, బాంబ్ స్క్వాడ్, కమ్యూనికేషన్ విభాగాల సిబ్బంది పాల్గొని తమ విధులకు సంబంధించిన పరికరాలు, సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

# బొగ్గు లోడింగ్‌లో సర్వకాలిక రికార్డును నెలకొల్పిన భారతీయ రైల్వే

న్యూఢిల్లీ, అక్టోబర్ 23:గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే, అక్టోబర్ 2026లో 18వ తేదీ వరకు బొగ్గు లోడింగ్‌లో 22.5% వృద్ధిని నమోదు చేసి, భారతీయ రైల్వే సర్వకాలిక రికార్డును సాధించింది. దేశవ్యా ప్తంగా ఉన్న థర్మల్ పవర్ ప్లాంట్‌లకు నమ్మకమైన బొగ్గు సరఫరాను నిర్ధారించడానికి కొనసాగుతున్న ప్రయత్నాలకు నిదర్శనంగా, ఈ కాలంలో అక్టోబర్ 2025తో పోలిస్తే బొగ్గు లోడింగ్ రోజుకు 87 రేకులు పెరిగింది.

2026–27 ఆర్థిక సంవత్స రం మొదటి అర్ధభాగంలో (ఊ1), భారతీయ రైల్వే థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు రోజుకు సగటున 430 బొగ్గు రేకులను పంపింది, ఇది గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 7.1% పెరుగుదలను నమోదు చేసింది.

2025 సెప్టెంబర్‌తో పోలిస్తే 2026 సెప్టెంబర్‌లో బొగ్గు రేకుల పంపిణీ రోజుకు 14% పెరగడం తో ఈ ఊపు కొనసాగింది.

దేశంలోని కొన్ని ప్రాంతా లలో అధిక పారిశ్రామిక ఉత్పత్తి మరియు వర్షపాతం లోటు కారణ ంగా పెరుగుతున్న ఇంధన విని యోగం, బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తికి పెరిగిన డిమాండ్ నేపథ్యంలో బొగ్గు రవాణా వేగం నిలకడగా ఉంది.

నిరంతరాయంగా బొగ్గును తరలించడం వల్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్లలో బొగ్గు నిల్వలు స్థిరంగా ఉండేలా సహాయపడింది, ఇది దేశవ్యాప్తంగా నమ్మకమైన విద్యుత్ ఉత్పత్తికి మద్దతు ఇస్తుంది. సమర్థవంతమైన బొగ్గు తరలింపును నిర్ధారించడానికి భారతీయ రైల్వే బొగ్గు మంత్రిత్వ శాఖతో సన్నిహిత సమన్వయంతో పనిచేస్తోంది. థర్మల్ విద్యుత్ ప్లాంట్లలో తగినంత బొగ్గు నిల్వలను నిర్వహించడానికి మరియు దేశ ఇంధన అవసరాలను తీర్చడానికి, బొగ్గు రవాణా మరియు సరఫరాను నిలకడగా కొనసాగించడానికి ఇది విద్యుత్ మంత్రిత్వ శాఖతో కూడా సమన్వయం చేసుకుంటోంది.

# జిల్లా పరిషత్‌ను సమగ్రాభివృద్ధి చేస్తా

### ఏఅ ఖతీజీఎష్ట్రజీనిజీతీ ఖీవటటఎ । జిల్లా పరిషత్‌ను సమగ్రాభివృద్ధి చేస్తా? సొంత ఆలోచనలతో నిధులు సమీకరించడమే నిజమైన అభివృద్ధి

అమరావతి, అక్టోబర్ 23: ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్లు, నిధులపైనే ఆధారపడకుండా, సొంత ఆలోచనలు, ప్రణాళికలతో నిధులు సమీకరించి పనులు చేపట్టడమే అసలైన అభివృద్ధి అని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకరరెడ్డి స్పష్టం చేశారు. తాడిపత్రి మున్సిపల్ కార్యాలయానికి తన స్వీయ ప్రణాళికలతో నిధులు తెచ్చి దాని రూపురేఖలను పూర్తిగా మార్చివేసినట్లు ఆయన వెల్లడించారు.

తాడిపత్రి నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల జెడ్పీటీసీ అభ్యర్థులతో కలిసి అనంతపురం జిల్లా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నామినేషన్ల సమర్పణ అనంతరం విలేకరులతో జేసీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు.

అనంతపురం జిల్లా పరిషత్‌ను అన్ని రకాలుగా సమగ్ర అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా జేసీ ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే తాడిపత్రి ప్రాంతానికి ఒక అంతర్జాతీయ స్థాయి డ్రైవింగ్ లైసెన్స్ సెంటర్ రాబోతోందని ప్రకటిస్తూ.. దేశంలో కేవలం రెండు ప్రాంతాల్లో మాత్రమే ఇటువంటి ప్రతిష్టాత్మక సెంటర్లు ఉన్నాయని చెప్పారు. విద్యావంతులకు ప్రాధాన్యం ఇస్తూ యల్లనూరు జెడ్పీటీసీ స్థానానికి ఎమ్.టెక్ (ఓ.ువఇష్ట్ర) చదివిన యువతికి అవకాశం కల్పించినట్లు తెలిపారు.

తాడిపత్రి ప్రాంతంలో ఎన్నికల గెలుపోటముల కంటే ఫ్యాక్షన్ సంస్కృతిని పూర్తిగా రూపుమాపడమే తన ప్రాథమిక లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలో అపార అనుభవం ఉన్నందున స్థానిక ఎన్నికలంటే తనకు ఎలాంటి భయం లేదన్నారు. రాబోయే కాలంలో ఓటర్లలో గణనీయమైన మార్పు రాబోతోందని సంచలన వ్యాఖ్యలు చేశారు.

# మెట్‌పల్లి బస్టాండ్ సమస్యలకు త్వరలో పరిష్కారం

### ప్లాట్‌ఫారమ్ విస్తరణకు చర్యలు.. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం



కరీంనగర్, అక్టోబర్ 23:మెట్‌పల్లి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపిస్తామని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ తెలిపారు. బస్టాండ్ ప్లాట్‌ఫారమ్‌ను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. బస్టాండ్ ఇన్‌గేట్, ఔట్‌గేట్ వద్ద నెలకొన్న ప్రమాదకర పరిస్థితులపై ఆయన ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ మేరకు ఆర్టీసీ డిపో మేనేజర్ హరిని సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బస్టాండ్‌కు నిత్యం పెద్ద సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండటంతో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. బస్సుల రాకపోకల సమయంలో ఇన్‌గేట్, ఔట్‌గేట్ వద్ద ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించారు. ముఖ్యంగా ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని11 స్పష్టం చేశారు.

బస్టాండ్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ప్లాట్‌ఫారమ్ విస్తరణ ద్వారా రద్దీని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. ప్రయాణికుల ఇబ్బందులను నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పర్యటనతో బస్టాండ్ సమస్యల పరిష్కారంపై ప్రయాణికుల్లో ఆశలు చిగురించాయి. ప్లాట్‌ఫారమ్ విస్తరణతో పాటు గేట్ల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు త్వరగా అమలులోకి రావాలని వారు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ హరి, బీఆర్ఎస్ కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థిని వైద్య విద్యకు ఆర్థిక చేయూత

### నిఖిత ఎంబీబీఎస్ చదువుకు మాజీ ఎంపీపీ, జడ్పీటీసీ గోలి ప్రణీత పింగల్‌రెడ్డి రూ.50 వేల సాయం



నల్గొండ, అక్టోబర్ 23: ఆర్థిక ఇబ్బందులతో వైద్య విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిన నిరుపేద విద్యార్థిని నిఖితకు మాజీ ఎంపీపీ, జడ్పీటీసీ గోలి ప్రణీత పింగల్‌రెడ్డి అండగా నిలిచారు. ఆమె చదువును కొనసాగించేందుకు రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. బీబీనగర్ మండలం జైనపల్లి గ్రామానికి చెందిన సోము మాధవి జంగయ్య దంపతుల కుమార్తె సోము నిఖిత పదో తరగతిలో 10 జీపీఏ, ఇంటర్మీడియట్‌లో 1,000 మార్కులకు 989 మార్కులు సాధించింది. నీట్‌లో మంచి ర్యాంకు సాధించి పటాన్‌చెరువులోని మహేశ్వర మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందింది. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా కళాశాల ఫీజు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది.

ఈ విషయాన్ని నిఖిత చదువుకున్న 10వ తరగతి పాఠశాల కరస్పాండెంట్ ఈసారపు అచ్చయ్య గౌడ్ గోలి ప్రణీత పింగల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి రూ.50 వేల సాయం అందించారు. ఆర్థిక ఇబ్బందులతో ప్రతిభావంతులైన విద్యార్థులు చదువుకు దూరం కాకూడదన్నదే తమ అభిమతమని, నిఖిత వైద్యురాలిగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ అక్బర్, పింగల్ అన్న సేవాదళ్ అధ్యక్షుడు ఎండీ మోయిన్, ఎలుగుల నరేందర్, కాసుల అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

# శౌర్య కమాండోలను రంగంలోకి దింపిన ఐటీబీపీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 23:ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీసులు కొత్త తరహా దళాన్ని క్రియేట్ చేశారు. శౌర్య కమాండోల(రాష్ట్రజీబీతీఎజీ అనీఎఎజీనిటనీబ)ను సరిహద్దుల్లో మోహరిస్తున్నట్లు ఐటీబీపీ పేర్కొన్నది.

ఇటీవల అరుణాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రదేశాల్లో చైనీస్ పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ దళాల్ని శౌర్య కమాండోలు అడ్డుకున్నట్లు ఐటీబీపీ చీఫ్ శత్రుజీత్ సింగ్ కపూర్ తెలిపారు.

చైనాలో సుమారు 3488 కిలోమీటర్ల మేర సరిహద్దు ఉందని, అయితే యుద్ధ సంసిద్ధతలో భాగంగా ఆ బోర్డర్ వెంట శౌర్య కమాండో బెటాలియన్లను మోహరించనున్నట్లు కపూర్ తెలిపారు. ప్రస్తుతం అత్యాధుక యుద్ధ టెక్నాలజీ పెరుగుతున్న నేపథ్యంలో దానికి తగిన రీతిలో దళాలను మోహరిస్తున్నట్లు చెప్పారు.

# పోలీసుల పనితీరును కళ్లకు కట్టిన ఓపెన్ హౌస్

### 500 మంది విద్యార్థులకు ఆయుధాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమం




వరంగల్, అక్టోబర్ 23: పోలీసుల విధులు, దర్యాప్తు విధానం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు ప్రత్యక్షంగా పరిచయం చేసేందుకు భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఏకే–47, ఎస్ఎల్ఆర్, కార్బైన్, 9 ఎంఎం పిస్టల్ తదితర ఆయుధాలను ప్రదర్శించి, వాటి వినియోగం గురించి వివరించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ పనితీరును విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపించారు. అలాగే వేలిముద్రల గుర్తింపు విధానం, సీసీ కెమెరాల పనితీరుపై అవగాహన కల్పించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం, ట్రాఫిక్ నిబంధనల పాటింపు, మహిళల భద్రత, అత్యవసర సమయాల్లో డయల్ 112 సేవలను వినియోగించుకునే విధానాన్ని వివరించారు. పోలీసుల విధులు, నేరాల దర్యాప్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రాధాన్యాన్ని విద్యార్థులకు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీ సంపత్ రావు, సీఐ శ్రీనివాస్, పోలీసు అధికారులు, సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌కు ఎప్పుడు ఓటు వేయాలా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు : కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 23: గత ఎన్నికల్లో హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవలేదు. అడ్డమైన మాటలు, అడ్డమైన ప్రచారం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శుక్రవారం ఆయన అంబర్‌పేటలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు.రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వస్తాయా.. కేసీఆర్‌కు ఎప్పుడు ఓటు వేయాలా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో కరెంట్ లేక రైతులు గోస పడుతున్నారు. తాగునీటికి తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

అన్ని వర్గాలను కాంగ్రెస్ పార్టీ నిండా ముంచిందని మండిపడ్డారు. పరిపాలన చేతకాక ప్రజలకు ఏమీ చేయలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వంపై తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారు. ఎల్‌నినో ప్రభావంపై 10 నెలల ముందే ప్రభుత్వాన్ని అలర్ట్ చేశారు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.పక్క రాష్ట్రాలు, దిగువ రాష్ట్రాలు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుని ప్రాజెక్టులను నింపుకున్నాయి.

తెలివిలేని రేవంత్ రెడ్డి మాత్రం ప్రాజెక్టులను నింపలేదని పేర్కొన్నారు. కాళేశ్వరం పంపులు ప్రారంభిస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందని, తాను చేసిన అబద్ధాలు ప్రజల ముందు తేలిపోతాయని రేవంత్ రెడ్డి కుట్ర చేశారు. మేడిగడ్డ కూలిపోయిందంటూ తప్పుడు ప్రచారం చేశారు. కాంగ్రెస్ వాళ్లే మేడిగడ్డను కూల్చారన్నారు. రాహుల్ గాంధీని తీసుకొచ్చి మేడిగడ్డ కూలిపోయిందంటూ అబద్ధాలు చెప్పించారన్నారు. కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మరని కేటీఆర్ తెలిపారు.

రేవంత్ రెడ్డి దున్నపోతు ఈనిందంటే.. కిషన్ రెడ్డి దూడను కట్టేయమంటారు. కేసీఆర్‌పై విమర్శలు చేసే విషయంలో కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు ఒక్కటవుతాయి. పిచ్చోడి చేతిలో రాయిలా పాలన సాగుతోంది. మరో ఏడాది రేవంత్ రెడ్డి హడావుడి ఉంటుందని, ఆ తర్వాత కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని తెలిపారు. తెలంగాణలో లూటీ పాలన నడుస్తోంది. తెలంగాణలో తిరిగి కెసిఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయం. కాంగ్రెస్ చేతుల్లో మోసపోయిన అన్ని వర్గాలు బీఆర్ఎస్ వైపు చూస్తున్నాయని చెప్పారు.

తెలంగాణలోనే కాదు మళ్లీ దేశంలో కేసీఆర్ కీలకం కాబోయే రోజులు దగ్గరలో ఉన్నాయని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ యేతర పార్టీలు దేశంలో కీలకం కాబోతున్నాయి. నాలుగు సంవత్సరాల కింద కేసీఆర్ కాంగ్రెస్, బిజెపియేతర కూటమి అంటే చాలామందికి అర్థం కాలేదు. మోదీ ఏం చేస్తున్నాడో చూస్తానే ఉన్నాం. ఈరోజు ఒకవైపు దేశాన్ని సంక్షోభంలోకి నెడుతున్న బిజెపికి ప్రత్యామ్నాయ ఎజెండా లేని కాంగ్రెస్ చూసిన తర్వాత కెసిఆర్ చెప్పింది వాస్తవం అని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.రాహుల్ గాంధీ ఎంత చేసిన లాభం లేదు. రాహుల్ గాంధీకి ఎన్ని జాకీలు పెట్టిన లేస్తలేదు.

దేశంలో కాంగ్రెస్ విఫలమైంది కాబట్టే బిజెపి పార్టీపై సీజేపీ పేరుతో యువతీ యువకులు పోరాటం చేస్తు న్నారని గుర్తు చేశారు. రాజకీయ నాయకులను బిజెపి బెదిరించగలుగుతుంది కానీ యువతరాన్ని కాదు అని అర్థమైంది. బిజెపి గత పది సంవత్సరాలు ఎప్పుడు లేనంత బలహీనంగా తయారయిందన్నారు. కాంగ్రెస్, బిజెపి ఎంపీలు తెలంగాణలో కలిసిపోయి పనిచేస్తున్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసం పనిచేయకుండా కేవలం.. కేసీఆర్, కేటీఆర్ ని తిట్టడమే పనిగా పెట్టుకు న్నారు.

రాష్ట్రంలో ఎంపీటీసీ జడ్పిటిసి కార్పొరేషన్ ఎన్నికలు పెట్టే ధైర్యం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్‌కు లేదని పేర్కొన్నారు. కార్పొరేషన్ ఎన్నికలు పెడితే 2017లో సెంచరీ కొట్టిన తీరుగా బీఆర్ఎస్ కార్పొరేషన్లను గెలుచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటర్ల నమోదు నుంచి మొదలుకొని ఎన్నికల దాకా కలిసి పనిచేయాలి. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ధన బలాన్ని మాత్రమే నమ్ము కున్నది. విద్యార్థులను నిరుద్యోగులను యువతి యువకులను యూత్ డిక్లరేషన్ పేరుతో దారుణంగా మోసం చేసింది. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వారు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.



# పుల్లెల శ్రీరామ చంద్రుని రచనలు భారతీయ తత్త్వ శాస్త్రానికి మార్గదర్శక దీప స్తంభాలు

**అక్టోబర్ 24... పుల్లెల శ్రీరామ చంద్రుని జయంతి సందర్భంగా సంస్కృత తత్త్వ ప్రబోధకుడి జీవన యాత్ర**



భారతీయ తత్వశాస్త్రం, వేదాంత సిద్ధాంతం, సంస్కృత సాహిత్య పరిష్కారానికి తన జీవితాన్నే అంకితం చేసుకున్న మహా మనిషి పుల్లెల శ్రీరామ చంద్రుడు (అక్టోబరు 24, 1927 – జూన్ 24, 2015). 20వ శతాబ్దపు భారతీయ పండిత లోకంలో ఆయన ఒక వెలుగొందిన నక్షత్రంగా నిలిచారు. సంస్కృత భాష పట్ల అపారమైన ప్రేమ, వేదాల మీద లోతైన అవగాహన, తత్త్వ గ్రంథాలపై నిబద్ధత, విశ్లేషణ సామర్థ్యం ఆయన్ను ఋషి సమానంగా చేసి మానవ సంస్కృతిలో అమర చరిత్రగా నిలిపాయి. ఆయన జీవితం ఒక నిరంతర విజ్ఞానాధ్యయన ప్రయాణం. జీవన ధ్యేయంగా సంస్కృతం, తత్త్వ చింతనను స్వీకరించి, అన్వేషణను, అధ్యయనాన్ని, బోధనను త్రిబంధంగా మలిచిన వారిలో పుల్లెల ప్రథమ శ్రేణిలో నిలిచారు. పాండిత్యంలో, వ్యాస రచనలో, ఉపనిషత్ వ్యాఖ్యానంలో, వేదాంత విశ్లేషణలో ఆయనకు సమకాలీనుల్లో సాటి లేరు. ఆయన పదునైన తత్త్వ దృష్టి, సారగ్రాహిత్యం, భాషా పటిమ ఆయన రచనల్లో ప్రతిఫలించి, భక్తజన హృదయాల్లో చిరస్థాయిగా నిలిచాయి.

1927 అక్టోబరు 24న తూర్పుగోదావరి జిల్లా ఐనవోలు మండలం ఇందుపల్లి గ్రామంలో పుల్లెల సత్యనారాయణ శాస్త్రి, సత్యవతి దంపతులకు జన్మించిన శ్రీరామ చంద్రుడు చిన్ననాటి నుంచే పాండిత్య వాతావరణంలో ఎదిగారు. తండ్రి వద్దే పంచ కావ్యాలు, నైషధం, అనర్ఘ రాఘవం వంటి ప్రాచీన కావ్యాలను, సిద్ధాంత కౌముదిని అధ్యయనం చేశారు. ఆయన విద్యారంభం నరేంద్రపురం లోని సంస్కృత పాఠశాలలో మొదలై మైలాపూర్ సంస్కృత కళాశాలలో వేదాంత శిరోమణి విద్యతో పరిపుష్టి చెందింది. ఆంగ్ల భాషను వి.వెంకటాచలం అనే సహపాఠి వద్ద నేర్చుకొని, హిందీలో విశారదగా ఉత్తీర్ణులై మలికిపురం హైస్కూలులో హిందీ పండితుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు.

విద్య పట్ల ఉన్న అసాధారణ అభిరుచి ఆయనను అనేక విశ్వ విద్యాలయాల దాకా తీసుకెళ్లింది. బెనారస్ హిందూ యూనివర్సిటీలో అలంకార శాస్త్రంలో ఎం.ఎ., ఆంగ్లంలో ఎం.ఎ., హిందీలో ఎం.ఎ. పూర్తి చేశారు. 1966లో ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి పీహెచ్.డి పొందారు. "Contributions of Panditaraja Jagannatha to Sanskrit Poetics అనే అంశంపై చేసిన పరిశోధన ఆయన్ను తత్త్వ సాహిత్యంలో అధ్యయన శ్రేణి లోనూ, విశ్లేషణా దృష్టి లోనూ అగ్రగామిగా నిలిపింది.

ఉద్యోగ జీవితంలో మలికిపురం నుండి అమలాపురం, వరంగల్, హైదరాబాద్, తిరుపతి వరకు వివిధ కళాశాలల్లో సంస్కృత పండితునిగా, లెక్చరర్‌గా, ప్రొఫెసర్‌గా సేవలందించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో సంస్కృత విభాగ అధిపతిగా, సంస్కృత అకాడెమీ డైరెక్టర్‌గా, సురభారతి సమితి కార్యదర్శిగా, ఉపాధ్యక్షునిగా పలు బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన బోధనా శైలి లోతైన తత్త్వాన్ని సరళంగా వివరిస్తూ, శిష్యులకు ఆధ్యాత్మిక అధ్యయనంలో ఆరాటాన్ని కలిగించేదిగా ఉండేది.

ఆయన రచనలు భారతీయ తత్త్వ శాస్త్రానికి మార్గదర్శక దీప స్తంభాలు. ఉపనిషత్తులపై ఆయన చేసిన వ్యాఖ్యానాలు ? ఐతరేయ, కేన, కఠ, మాండూక్య, ఇశావాస్య, శ్వేతాశ్వతర, బృహదారణ్యక ? విశ్లేషణా దృష్టిలో, భాషా నైపుణ్యంలో, తత్త్వనిష్ఠలో అత్యున్నతంగా నిలిచాయి. వేదాంత ప్రసారం కోసం రాసిన శంకర విజయం, ఉపనిషత్తుల సారం, శ్రీరామకృష్ణ పరమహంస చరితం, భగవద్గీత భావ దీపిక, వేదాంత దర్శనం, భారతీయ తత్త్వశాస్త్ర పరిచయం వంటి గ్రంథాలు ఆధ్యాత్మిక విభూతుల దృష్టికీ, సాధారణ పాఠకుల ప్రశ్నలకూ సమాధానాలుగా నిలిచాయి. బ్రహ్మసూత్ర శంకర భాష్యానికి తెలుగులో వ్యాఖ్యానం, భరతముని నాట్య శాస్త్రానికి తెలుగు వ్యాఖ్యానం, మహాభారత. సార సంగ్రహం" తో పాటు, శ్రీ వాల్మీకి రామాయణము (అనువాదం – 10 సంపుటాలు),

అలంకార శాస్త్రంలో 16 గ్రంథాలకు తెలుగులో వ్యాఖ్యానం వ్రాసిన ఏకైక పండితులు పుల్లెల. తమ పదునాలుగవ యేట నుండి రచనలు చేయడం ప్రారంభించారు. తెలుగు, సంస్కృత, ఆంగ్ల భాషలలో 200లకు పైగా పుస్తకాలను వెలువరించారు.

ఆయన భాషాశైలి శాస్త్రీయంగా ఉండి కూడా అర్థవంతంగా ఉంటుంది. సంస్కృతం, తెలుగు, ఆంగ్లం భాషల్లో సమానమైన పట్టు కలిగిన పుల్లెల శ్రీరామ చంద్రుడు మల్టీ లింగ్వల్ స్కాలర్‌గా అంతర్జాతీయంగా గుర్తింపు పొందారు. భాషల మధ్య మాధుర్యాన్ని, తత్త్వాల మధ్య అన్వయాన్ని, భావాల మధ్య సంస్కారాన్ని నిర్మించిన తత్త్వవేత్త ఆయన.

ఆయనకు భారత ప్రభుత్వం 2011లో పద్మశ్రీ పురస్కారం ప్రకటించింది. కేంద్ర సాహిత్య అకాడెమీ నుండి ఉత్తమ అనువాద పురస్కారం (1996), ఉత్తమ సాహితీ విమర్శ పురస్కారం (2002) లభించాయి. బిర్లా ఫౌండేషన్ వాచస్పతి పురస్కారం (2004), మహామహోపాధ్యాయ బిరుదు, తెలుగు విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్ (2011), కేంద్ర రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్ గౌరవ డి.లిట్ (2013), సి.పి. బ్రౌన్ అకాడమీ తెలుగు భాషా పురస్కారం (2011) తదితర ఎన్నో అవార్డులతో ఆయన్ను సత్కరించారు. రాష్ట్రపతి పురస్కారం, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల విశిష్ట సత్కారాలు ఆయన సేవలకు గౌరవ సూచకాలు.

విద్యార్థులపై ఆయనకున్న మక్కువ, ఉపాధ్యాయ ధర్మంపై ఆయనకున్న నిబద్ధత ఆయనను గౌరవప్రదమైన గురువుగా మార్చాయి. పరిశోధన పరంగా విద్యార్థులకు సహకరించడంలో ఆయన చిరస్థాయిగా గుర్తింపు పొందారు. జ్ఞానాన్ని వితరణగా పరిగణించి, అధ్యయనాన్ని సాధనగా స్వీకరించి, తన శిష్య బృందానికి దారి దీపంగా నిలిచారు. శిష్యులు ఆయనకు కనకాభిషేకం చేసి, తన తత్త్వ ప్రయాణానికి అక్షర సాక్ష్యం ఇచ్చారు.

ఆయన చివరి రోజుల్లో అనారోగ్యంతో బాధ పడుతూ, 2015 జూన్ 24న హైదరాబాద్ బంజారా. హిల్స్‌లోని స్టార్ హాస్పిటల్‌లో తుదిశ్వాస విడిచారు. భారతీయ తత్త్వ విజ్ఞానానికి జీవ రూపం ఇచ్చిన పుల్లెల శ్రీరామ చంద్రుడు, తన జీవితాన్ని ధర్మ సిద్ధాంతానికి, వేదాంత ప్రచారానికి అంకితం చేశారు. ఆయన రచనలు, బోధనలు, జీవన ఆదర్శం భావితరాలకు బోధనా చరిత్రగా నిలిచిపోతాయి.

పుల్లెల శ్రీరామ చంద్రుడి జీవితకథ, భారతీయ ఆధ్యాత్మిక విజ్ఞాన సముపార్జనకు వెలకట్టలేని సంపద. భావితరాల్ని ప్రభావితం చేసే ఆయన సాహిత్య ప్రస్థానం, తపస్సుతో కూడిన పాండిత్యం, నిరంతర అధ్యయన సంకల్పం భారతీయ సంస్కృతిని, తత్త్వ దృష్టిని పదిలంగా నిలిపే శాశ్వత దీపం. అలాంటి మహానుభావుని జయంతి (అక్టోబర్ 24) రోజున మనం ఆయనకు జ్ఞావకార్థాంజలి ఘటించాల్సిందే.



–రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## యుద్ధ గీతాల సుద్దాల
## జాతీయ పురస్కారాలు – 26న రవీంద్రభారతిలో ప్రధానోత్సవం



హైదరాబాద్, అక్టోబర్ 23:(నేటినిజం ప్రతినిధి): కాలుకు గజ్జ కట్టి, భుజాన గొంగడి వేసుకుని, ఒకవైపు గన్ను మరోవైపు పెన్ను పట్టుకుని తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వల్లె వల్లెకు పాటను ప్రవహింపజేసిన యుద్ధ గీతాల రచయిత సుద్దాల హనుమంతు పేరిట 15వ జాతీయ పురస్కారాల ప్రధానోత్సవం ఈ నెల 26న రవీంద్రభారతిలో ఘనంగా జరగనుంది.

ఈ సంవత్సరం ప్రముఖ రచయిత్రి, 100 పుస్తకాల అనువాదకురాలు శ్రీమతి స్వాతి శ్రీపాదకు సుద్దాల జాతీయ పురస్కారం, అలాగే ఈ సంవత్సరం ప్రత్యేకత జాతీయ జానపద అవార్డు యక్షగాన కళాకారుడు మహమ్మద్ అక్బర్ పాషా కు అందజేయనున్నట్లు సుద్దాల ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుద్దాల అశోక్ తేజ తెలిపారు.

సుద్దాల గొంతు నుండి పాటలను తూటాలుగా మలిచి, ప్రజా శక్తులను ఉద్యమ బాట పట్టించిన ఆ కంచు కంఠం సుద్దాల హనుమంతు అని, ఆయన ప్రజా వాగ్గేయ వారసత్వాన్ని వారి మనవలు, మనుమరాలు నిరంతరాయంగా కొనసాగిస్తారని ఆయన అన్నారు.

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈరోజు ఉదయం 11 గంటలకు జరిగిన విలేకరుల సమావేశంలో సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ, ఈ నెల 26న సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతిలో సాంస్కృతిక ఉత్సవాలతో పాటు అవార్డుల ప్రధానోత్సవం జరుగుతుందని ప్రకటించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఐఏఎస్ కె.వి. రమణాచారి, అద్దంకి దయాకర్, వెలిదండ నిత్యానందరావు, నెల్లుట్ల రమాదేవి, సుద్దాల సుధాకర్ తేజ, తాటి రమేష్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

సుద్దాల హనుమంతు, జానకమ్మల స్ఫూర్తిని, ప్రజా పాటల వారసత్వాన్ని తాను బతికినంత కాలం, తన తర్వాత కూడా వారి వారసులు నిర్వహించేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నానని అశోక్ తేజ అన్నారు.

ఈ విలేకరుల సమావేశంలో జి. రాములు, భూపతి వెంకటేశ్వర్లు, వలస సుభాష్ చంద్రబోస్, ఎన్. సోమయ్య, మందుల విప్లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మీ ప్రమాణం' యాప్ ద్వారానే హాజరు నమోదు

ఖమ్మం, అక్టోబర్ 23:వైద్యారోగ్య శాఖ పరిధిలోని అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ 'మీ ప్రమాణం' ఫేషియల్ అటెండెన్స్ యాప్ ద్వారానే తప్పనిసరిగా హాజరు నమోదు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.రామారావు ఆదేశించారు.శుక్రవారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పిహెచ్‌సి , యుపిహెచ్‌సి సిబ్బంది ఉదయం 9 గంటలకు ఇన్, సాయంత్రం 4 గంటలకు ఔట్ అటెండెన్స్ నమోదు చేయాలన్నారు. జిల్లా కార్యాలయ సిబ్బంది ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు హాజరు వేయాలని సూచించారు. వైద్యాధికారులు, ప్రోగ్రామ్ అధికారులు తమ పరిధిలోని సిబ్బంది హాజరును నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఫేషియల్ అటెండెన్స్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.




## ఇస్లాం నగర్ డెవలప్‌మెంట్ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక

**అధ్యక్షుడిగా సయ్యద్ ఖలీం ఏకగ్రీవ ఎన్నిక**





రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 23:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని ఇస్లాం నగర్ డెవలప్‌మెంట్ కమిటీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ మాజీ అధ్యక్షుడు షేక్ గోరేమియా ఆధ్వర్యంలో కాలనీ వాసుల సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా సయ్యద్ ఖలీం, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ రహీం, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ ముజాహిద్, క్యాషియర్‌గా షేక్ అలీ, జాయింట్ సెక్రటరీగా సయ్యద్ అంకుస్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా సయ్యద్ సలీం, సయ్యద్ హైదర్, షేక్ చాంద్ మియా, సయ్యద్ కరీం, షేక్ కరీంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని స్థానికులు ఆకాంక్షించారు.

## బీసీ–డీ కులాలను 'ఏ' లో చేర్చొద్దు

**ఉట్నూరులో బీసీ–ఏ కుల సంఘాల డిమాండ్**

ఆదిలాబాద్, అక్టోబర్ 23:బీసీ–డీ గ్రూప్‌లో ఉన్న పెద్ద కులాలను బీసీ–ఏ గ్రూప్‌లో చేర్చడం వల్ల ప్రాథమికంగా వెనుకబడిన బీసీ–ఏ వర్గాలకు రిజర్వేషన్ల పరంగా తీవ్ర అన్యాయం జరుగుతుందని బీసీ కుల సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

శుక్రవారం ఉట్నూరులోని ప్రెస్ క్లబ్ ఆవరణలో బీసీ–ఏ కులాలకు చెందిన నాయకులు బింగి వెంకటేష్, కాల్వ రవి, తన్నీరు సతీష్, బొడ్డు నరసయ్య, రాములు తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం బీసీ–ఏ వర్గాలకు దక్కాల్సిన 7 శాతం రిజర్వేషన్ ఫలాలు సరిగా అందడం లేదని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బీసీ–డీలో ఉన్న ఆర్థికంగా, సామాజికంగా బలంగా ఉన్న పెద్ద కులాలను తీసుకొచ్చి బీసీ–ఏలో చేరిస్తే, ఇక్కడ ఉన్న కులవృత్తుల వారు, చిన్న కులాల వారు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద కులాల పోటీని తట్టుకొని బీసీ–ఏ వర్గాల పిల్లలు విద్యా, ఉద్యోగ రంగాల్లో నిలదొక్కుకోలేరని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బీసీ–డీ కులాలను బీసీ–ఏ వర్గంలో చేర్చే ప్రతిపాదనలను విరమించుకోవాలని, బీసీ–ఏ వర్గాలకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఈ విలేకరుల సమావేశంలో బీసీ–ఏ కుల సంఘ నాయకులు బి.మల్లేష్, రాచకొండ ప్రవీణ్, పందిరి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యే లక్ష్యం

**మల్లారంలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 23:(నేటినిజం ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామంలో సేవా సంకల్ప అభియాన్ డిజిటల్ ఎడ్యుకేషన్ అండ్ ఏఐ ఎంపవర్‌మెంట్ ఇనిషియేటివ్‌లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. గ్రామీణ విద్యార్థులకు డిజిటల్ విద్య, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. గురుకులాల్లో డైట్ ఛార్జీలు 40 శాతం, కాస్మెటిక్ ఛార్జీలు 200 శాతం పెంచి విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. కొండ్రాపోలులో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు ద్వారా నియోజకవర్గ విద్యార్థులకు నాణ్యమైన విద్యకు అవకాశం కల్పించామన్నారు. యువతకు ఉపాధి నైపుణ్యాలు అందించేందుకు ముచ్చర్లలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. మల్లారం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

## అమర పోలీసుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

**విద్యార్థులకు పోలీస్ విధులపై అవగాహన– రూరల్ ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి**




రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 23:(నేటినిజం ప్రతినిధి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే)లో భాగంగా వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. చెక్కపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో పోలీస్ చట్టాలు, సీసీ కెమెరాల ఉపయోగాలు, ఫింగర్‌ప్రింట్ పరికరాలు, ట్రాఫిక్ పరికరాలు, రహదారి నిబంధనలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను నివారించాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. అత్యవసర పోలీస్ సేవల కోసం 112కు, సైబర్ నేరాలపై ఫిర్యాదుకు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ మండల విద్యాధికారి కిషన్, ఉపాధ్యాయులు, ఏఎస్ఐ రవీందర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ బాపు రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొమురం భీం వర్ధంతి వేడుకలు

**నాలుగో తరగతి ఉద్యోగులంతా విధులకు హాజరుకావాలి!**

ఆదిలాబాద్, అక్టోబర్ 23:ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీఓ) మంద మకరందు, ఆసిఫాబాద్ జిల్లా డీడీ అంబాజీ జాదవ్ ఉత్తర్వుల ప్రకారం కేటాయించిన విధులకనుగుణంగా నాలుగో తరగతి ఉద్యోగులంతా విధులకు హాజరుకావాలని తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కేబీసీ నారాయణ కోరారు.

శుక్రవారం జైనూర్‌లో ఉద్యోగులతో కలిసి మాట్లాడిన ఆయన.. ఈ నెల 26న కేరమేరి మండలం జోడేఘాట్‌లో నిర్వహించే మన్యం వీరుడు కొమురం భీం వర్ధంతి కార్యక్రమం సందర్భంగా విధులు పొందిన 4వ తరగతి ఉద్యోగులు, వర్కర్లు 25వ తేదీ మధ్యాహ్నం 1 గంటకల్లా జోడేఘాట్‌కు చేరుకోవాలని సూచించారు. విధులు పొందిన ప్రతీ ఉద్యోగి నిర్లక్ష్యం వహించకుండా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. విధులకు గైర్హాజరయ్యే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే వర్ధంతి విధులకు ఎంపికైన నాలుగో తరగతి ఉద్యోగులను, వర్కర్లను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏటీడీవోలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంటనే రిలీవ్ చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు రామ్‌చందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.పోచం, నాయకులు మహేష్, వెంకటేష్, చిరంజీవి, తెలంగాణ రావు, దుర్పత, సంగీత, భీమ్రావు, పుల్లాబాయి, యమున తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.